కర్నూలు | నంద్యాల

వార్త

31 డిసెంబర్ 2022 శనివారం పేజీలు 4


# నూతన సంవత్సర వేడుకలను పర్యావరణ రహితంగా జరుపుకుందాం

**- జిల్లా కలెక్టరు మనజీర్ జిలాని సామూన్**



**నంద్యాల విద్య, డిసెంబరు 30, ప్రభాతవార్త:** రాబోయే జనవరి 1వ తేది నూతన సంవత్సర వేడుకలు, మొక్కలతో, పుస్తకాలతో జరుపుకొని పర్యావరణానికి పునాదులు వేద్దామని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్, జేసి నిశాంతిలు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరు, జేసి, ఎస్పీ రఘువీర్‌రెడ్డి చేతుల మీదుగా పోస్టర్‌లను ఆవిష్కరించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి, వైస్ చైర్మన్ మారుతి కుమార్, కోశాధికారి నాగేశ్వర్‌రావు, కార్యవర్గ సభ్యులు ఉస్మాన్‌బాష, మద్దిలేటి, తెలకపల్లి చైతన్య, డిఎఫ్ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటి వారు, జిల్లా అధికారులకు, నాయకులకు శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చేందుకు పర్యావరణను కాపాడుకునేందుకు బోకేలు కాకుండా మొక్కలు తీసుకురావాలని, విద్యాసామాగ్రి పుస్తకాలు, పెన్నులు తీసుకువచ్చి శుభాకాంక్షలు తెలిపాలని సూచించారు. సొసైటి వీటిని సేకరించి విద్యాశాఖ సహకారంతో నిరుపేద పిల్లలు చదివే స్కూల్స్, హాస్టల్స్‌లో వీటిని పంపిణి చేయడం జరుగుతుందని తెలిపారు. కలెక్టరు, ఎస్పీ, జేసి అదేశాలను జిల్లాలోని అన్నిశాఖల అధికారులు, వివిధ పార్టీ నాయకులు పాటించి పర్యావరణాన్ని రక్షించాలని వారు కోరారు.



## టిటిడి ఈవో ధర్మారెడ్డిని..
# ఓదార్చిన మంత్రి బొత్స

**జూపాడుబంగ్లా, డిసెంబర్ 30. ప్రభాతవార్త** తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో ధర్మారెడ్డిని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చంద్రమౌళిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా మాజీ మంత్రి పేర్ని నాని, చిత్తూరు ఎస్పి త్రిశాంతిరెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం ఇన్‌చార్జ్ ఈవో అనిల్‌కుమార్ సింగాల్, రిటైర్డు డిజిపి దామోదర్, హౌసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ అజైయ్ జైన్‌లు చంద్రమౌళిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి ధర్మారెడ్డిని ఓదార్చారు.



## శ్రీ మద్దిలేటి లక్ష్మినరసింహస్వామి ..
# ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు..!



**బేతంచెర్ల, డిసెంబర్30, ప్రభాతవార్త:** ఎర్రమల కొండల్లోని మద్దిలేరు సమీపాన కొలువైన శ్రీ మద్దిలేటి లక్ష్మినరసింహస్వామి, శ్రీ మహాలక్ష్మి అమ్మవారి క్షేత్రంలో ఈనెల 31వ తేది నుండి జనవరి 2వ తేది వరకు ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బి.సీతారామచంద్రుడు, ఈవో పాండు రంగారెడ్డి శుక్రవారం తెలిపారు. 31వ తేది శనివారం ఉదయం స్వామి అమ్మవార్లకు పూజలు, సాయంకాలం అంకురార్పణ, కలశపూజ, హోమం, మంగళహారతి, 6గంటలకు హనుమద్ వాహనం పై దేవేరుల సమేతంగా స్వామివారి ఊరేగింపు మంగళ వాయిద్యాల మధ్య నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల కాలక్షేపం కోసం రేలారే రేల విజేత గోపాల్ బృందం చేత జానపద కచ్చేరి ఉంటుందన్నారు. జనవరి 1వ తేది ఉదయం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు, సాయంకాలం గజవాహనం పై స్వామిఅమ్మవార్ల ఊరేగింపు ఉంటుందన్నారు. అదే రోజు బండలాగుడు పోటీలు, కబడ్డీ పోటీలు ప్రారంభం కానున్నాయని వారు తెలిపారు. రాత్రి 9గంటలకు భక్తుల కాలక్షేపం కోసం పంచమ కాముల నాటకం ఉంటుందన్నారు. 2వ తేది తెల్లవారుజామున 3గంటలకు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు, 4గంటల నుండి ఉత్తరద్వార దర్శనం ఉంటుంద న్నారు. ఉదయం 10గంటలకు స్వామిఅమ్మవార్లకు శాంతికళ్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. గజవాహన సేవ అనంతరం రథోత్సవం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు 2వ తేది రంగాపురం నుండి స్వామివారి సన్నిధి వరకు ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటుచేసినట్లు వారు తెలిపారు. రాత్రికి అఖండ భజన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు స్వామివారి ఉత్సవాలలో విరివిగా పాల్గొని స్వామిఅమ్మవార్ల కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు. వారితోపాటు ధర్మకర్తల మండలి సభ్యులు ఉన్నారు.

## శిధిలాల తొలగింపు
# పనుల పరిశీలన

**శ్రీశైలంప్రాజెక్టు, డిసెంబర్30, ప్రభాతవార్త :** శ్రీగిరిలో రధశాల-పోస్టాపీసు, రధశాల-పాతళగంగ మార్గములో తొలగించబడిన దుఖాణాల శిధిలాల ఎత్తివేత పనులను శుక్రవారంనాడు శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాదికారి ఎస్.లవన్న ఇంజనీరింగు, రెవిన్యూ ఆదికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ శిధిలాల ఎత్తివేత పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పిబ్రవరి 11 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సావాలు ప్రారంబమవుతాయని ఆప్పటి లోపు రహదారి (సిసి రోడ్డు నిర్మాణాన్ని) పూర్తి చేయాలన్నారు. తదుపరి లలీతాంబిక దుఖాణాలలో వ్యాపారాలు చేసుకుంటున్న వారితో సంబాషించారు. అదే విధంగా చెంచు గిరిజనులతో మాట్లాడుతూ ప్రణాళిక బద్దంగా వ్యాపారాలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ రామకృష్ణ, పిఆర్ఓ శ్రీనివాసరావు, రెవిన్యూ విబాగం పర్యవేక్షకులు అయ్యన్న, శ్రీశైలప్రభ సంపాదకులు డాక్టర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ పథకాలు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- సోషల్‌మీడియా వేదికగా పచ్చమీడియా ఎత్తులను చిత్తుచేయాలి
- ఎన్నికలే లక్ష్యంగా చురుగ్గా పనిచేయాలి
- కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు బి వై రామయ్య, కాటసాని



**కర్నూలు మున్సిపల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వైయస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు నగర మేయర్ బి వై రామయ్య, నంద్యాల అధ్యక్షులు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం రావూరి గార్డెన్ ఫంక్షన్ నందు కల్లూరు అర్బన్‌లో వాలంటీర్లు, నూతన సచివాలయ కనీ్వనర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి, జనసేన, పచ్చమీడియాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా తిప్పికొట్టాలని కోరారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగితే 175కు 175 స్థానాలు గెలువడం కష్టమేమి కాదన్నారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి జగన్ సచివాలయ వాలంటీర్ల వ్యవస్థ ద్వారా సాకారం చేశారన్నారు. అర్హతలు కలిగి పథకాలు అందని వారు ఇంకా ఏవరైనా ఉన్నారేమో గుర్తించి ధరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నందున అందరికి పథకాలు అందేలా చూడాలని తెలిపారు. పింఛన్లు ఎక్కడా కూడ తొలగించడం లేదని అలా జరగడానికి కూడ వీలులేదన్నారు. కేవలం వెరిఫికేషన్ మాత్రమే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గ పరిశీలకులు గోకుల్ కృష్ణారెడ్డి, డిప్యూటి మేయర్ సిద్దారెడ్డి రేణుక, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంత్‌రెడ్డి, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల జిల్లా పర్యవేక్షకులు కుమార్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టరు ఎన్ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బెల్లం మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు, కో-అప్షన్ మెంబర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యువత సమస్యలపై పోరాటం చేసేందుకే..
# నారా లోకేష్ యువగళం




**కర్నూలు న్యూసిటి, డిసెంబరు 30, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నర సంవత్సరాల పాలనలో రాష్ట్రంలో యువతకు ఎలాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసి వారిని పూర్తిగా నిరాశ నిస్పృహలకు గురిచేశారని, దిక్కుతోచని స్థితిలో వున్న యువతకు అండగా నిలవాలని, యువత హక్కుల, సమస్యలపై పోరాటం చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌కు కనువిప్పు కలిగించేందుకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, యువ నాయకులు నారా లోకేష్ 2023 జనవరి 27 నుండి కుప్పం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి యువగళం పేరుతో పాదయాత్ర ప్రారంభించనున్నారని టిడిపి జిల్లా పార్లమెంటు అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. పాదయాత్ర రాష్ట్రంలో మొత్తం 100 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 400 రోజులు 4,000 కిలోమీటర్ల మేర కొనసాగుతుందని ఆయన తెలిపారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయం నుంచి విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తరువాత ఏర్పడిన అవశేష ఆంధ్ర రాష్ట్రానికి 2014లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారాచంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని యువత కోసం వివిధ దేశాల్లో పర్యటించి రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడంలో సఫలికృతులయ్యారన్నారు. అయితే దురదృష్టవశాత్తు రాష్ట్ర ప్రజలను జగన్ ఒక్కఅవకాశమని ప్రాధేయపడినందున ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించారు. అయితే అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించి రాష్ట్రాన్ని తిరోగమనంవైపుకు నెట్టెశారన్నారు. నారాలోకేష్ చేయబోయే పాదయాత్ర పూర్తిగా విజయవంతం అయ్యేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. జిల్లాలో చంద్రబాబు నిర్వహించిన ఇదేం ఖర్మ కార్యక్రమం విజయవంతం అయ్యిందన్నారు. పాదయాత్ర కూడ 14 నియోజకవర్గాల్లో జరిగే విధంగా పూర్తిగా విజయవంతం చేసేదిశగా కార్యక్రమాలు రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. పాదయాత్రకు అడ్డంకులు సృష్టిస్తే యువకులే చూసుకుంటారని తెలియజేశారు. పాదయాత్రకు భద్రత కల్పించి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని కోరారు.

# అంతరాష్ట్ర దోపిడీ దొంగల ముఠా అరెస్టు

- 12 మంది పోలీసులకు దొంగలు దొరికారు
- 1.13 కేజిల బంగారం,రూ.5.75 లక్షల నగదు, రెండు కార్లు స్వాధీనం
- సిఐలను, ఎస్ఐలను ప్రశంసించిన జిల్లా ఎస్పీ



**నంద్యాల క్రైం, డిసెంబరు 30, ప్రభాతవార్త:** కర్నూలు, కడప, అనంతపురం, పొరుగు జిల్లా అయిన ప్రకాశం జిల్లాల్లో గత ఏడాదిగా వరుస దొంగతనాలకు పాల్పడిన అంతరాష్ట్ర దొంగల ముఠా గుత్తికొండ, పవన్ కుమార్ అలియాస్ కార్తీక్, వేముల శివశంకర్ అలియాస్ రాజు, తలారి మారెన్న అనే అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేశామని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన నంద్యాల ఎస్పీ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ రమణ, అడ్మిన్ నంద్యాల డిఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, డోన్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఆత్మకూరు డిఎస్పీ శృతిలతో కలిసి విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. వరుస దొంగతనాలు చేస్తు ప్రజల కంటికి కునుకు లేకుండా దొంగలు హాల్‌చేల్‌చేస్తుండడంతో పోలీస్‌లకు సవాల్‌గా మారారు. ఈఏడాది జనవరి నెల నుంచి సంవత్సరం పాటు రాష్ట్రంలో జరిగిన 24 కేసులకు సంబంధించి 12 మంది ముద్దాయిలను అరెస్టు చేశామని తెలిపారు. నంద్యాల అర్బన్ పిఎస్, దొర్నిపాడు పిఎస్‌లో కేసు వివరాలు 2022లో నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో మాండ్ల రోశమ్మ ఇంటివద్దకు వెళ్లి సుమారు 2 తులాల బంగారు గొలుసును లాక్కొని మోటర్ సైకిల్‌పై పరార్ అయ్యారు. రైతునగరంలో సాయిజిత్‌కాలనీలోని పసుల నాగలక్ష్మి కిరాణం అంగడిలో ఉండగా ఆమె మెడలో నుంచి 4 తులాల బంగారు గొలుసు, దొర్నిపాడు మండలంలోని కంబలూరు పాములేటి యొక్క ఇంటితాళం పగలగొట్టి 2 తులాల బంగారు బ్రాస్‌లైట్, బంగారు తాళిబొట్టు, ఒకజత మాటిలు, రూ.7 వేలు నగదు, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా ముత్తుట్ ఫైనాన్స్ దోపిడికి రెక్కి నిర్వహించారు. కానీ భద్రత ఎక్కువ ఉన్నందున దొంగతనం చేయడానికి వీలుకాలేదని వివరించారు. గత కొద్ది కాలం నుంచి దొంగల కదలికలపై నిఘావుంచి అనకల మాదవకృష్ణ, తలారి శ్రీనివాసులు, రుద్రవరం మండలానికి చెందిన బత్తూలూరి రామ చంద్రుడు, సార మేకల పెద్ద వుశేన్, బోయ బాలయ్యలను అరెస్టు చేశామన్నారు. నందికొట్కూరు పిఎస్‌లో దొంగతనాలకు పాల్పడిన నిందితుల వివరాలు వనర్చి కోటయ్య, చలపతి చిన్ననరసింహులు, జలపతి రాములమ్మలు వీరంతా అనంతపురం జిల్లా కదిరికి చెందినవారని వీరి నుంచి బంగారు అభరణాలు, స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. దొంగలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటికి తాళం వేస్తే దొంగలుపడే రోజులు వచ్చాయని తెలిపారు. గ్రామ, పట్టణాలు వదిలి వేరే ఊర్లకు వెళ్లనప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈక్రమంలో 12 మంది ముద్దాయిలను చాకచక్యంగా పట్టుకోవడంలో విశేష ప్రతిభ కనబరిచిన బనగానపల్లె సిఐ సుబ్బరాయుడు, నంద్యాల తాలూక అర్బన్ పిఎస్ సిఐ వాక మురళీ మోహన్, నందికొట్కూరు సిఐ విజయభాస్కర్, నంద్యాల సిసిఎస్ సిఐ రామకృష్ణలను అభినందించి వారికి రివార్డులు ప్రకటించారు. ఈసమావేశంలో సిఐలు కృష్ణయ్య, రవీంద్ర, ప్రభాకంరెడ్డి, సుబ్బరా యుడు, జీవన్ గంగాధర్‌బాబు, వెంకటేశ్వర్ రావు, సుధాకర్‌రెడ్డి, నరేష్‌బాబు, ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, శంకర్ నాయక్, తిరుపాలు, సుబ్బరామిరెడ్డి, రామాంజనేయరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీ..
# వ్యక్తి మృతి

**జూపాడుబంగ్లా, డిసెంబర్ 30. ప్రభాతవార్త** గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలోని కెజి కెనాల్‌వంతెనపై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. తాటిపాడు గ్రామానకి చెందిన ఇదుర్ భాష జూపాడు బంగ్లాలోని హోటల్లో టీ తాగేందుకు వచ్చి ప్రమాదానికి గురైయారు. ఇదుర్‌భాష టీ తాగి ఎక్స్ఎల్ మోటర్ సైకిల్‌పై గ్రామానికి వెళ్లుతుండంగా గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. దీంతో ఇదుర్‌భాష అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకట సుబ్బయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.







# సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ నుండి ఒక మంచినీటి పైప్‌లైన్ వేయాలి

**- జనసేన నాయకులు**

ఆదోని రూరల్,డిసెంబరు 30,ప్రభాతవార్త కుప్పగల్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుండి మూడు గ్రామాలకు ఒక మంచినీటి పైప్‌లైన్ వేయాలని జనసేన మండల నాయకులు యం తాహెర్‌వలి,నాయకులు రేణువర్మ,పులిరాజులు అన్నారు. శుక్రవారం జనసేన కార్యాలయం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పగల్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుండి కుప్పగల్,బల్లేకల్లు,పాండవగల్లు,జాలిమంచి, గణేకల్లు,ఇస్వి గ్రామాలకు సురక్షిత మంచినీరు అరకొరగా సరఫరా జరుగుతున్నాయన్నారు. పైన తెలిపిన ఆరు గ్రామాలకు ఒకే మోటరు ఒకే పైప్‌లైన్



నుంచి సరఫరా చేయడంతో తరచూ మోటారు రిపేరు రావడం, పైపులు పగిలిపోవడం జరుగుతుందన్నారు. జనాభా పెరగడం మరోపక్క గ్రామాల విస్తీర్ణం పెరగడంతో తాగునీటికి అంతరాయం కలుగుతుందన్నారు. గ్రామాల్లో బోరు బావిలు ఉన్నప్పటికీ ఆ నీరు తాగటానికి ఉపయోగపడటం లేదన్నారు. అందుకనే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుండి సరఫరా అయ్యే నీటిపైనే ఈ ఆరు గ్రామాలు ఆధారపడి ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారం కోసం కుప్పగల్ గ్రామంలో ఒక అండర్‌గ్రౌండ్ మంచినీటి సంప్‌ను నిర్మించి ఇక్కడి నుంచి జాలిమంచి,ఇస్వి,గణేకల్లు గ్రామాలకు మంచినీరు సరఫరా చేసి సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే 2019లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు గండిపడి ఇప్పటికీ పూర్తిస్థాయిలో మరమత్తుల పనులు చేయటం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయిలో మరమత్తులు చేసి ట్యాంకులో నీరు నిల్వ ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు,కార్యకర్తలు దసప్ప,నాగరాజు, వీరేష్,శాంత,నరసన్న, హనుమంత రెడ్డి, జయరాజ్,భీమన్న,లోకేష్, బాబు,మహేంద్ర, సిద్ధు,కళ్యాణ్,అశోక్,రమేష్,రవివర్మ,రామ్‌రెడ్డి,ఈరన్న, రాజు తదితరులున్నారు.

## బాధపడొద్దు...నేనున్నాను

**కర్నూలు మున్సిపల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** వారంతా పారిశుద్ధ్య కార్మికులు, తమ గోడు చెప్పుకోవడానికి మున్సిపల్ కార్యాలయం వెళ్లారు. మేయర్‌ను కలువడానికి ఆయన చాంబర్ బయట ఎదురుచూశారు. కాసేపటికి మేయర్ బయటకు రాగ అందులో ఒకరు నారాయణమ్మ అనే మహిళ మేయర్‌ను చూడగానే కన్నీటి పర్వతమయ్యారు. తను రిటైర్మెంట్ అయ్యాను భర్త చనిపోయాడు పిల్లలు చేతికొచ్చినా ఉపాధి లేదంటూ ఆమె గోడు వెల్లగక్కింది. స్పందించిన మేయర్ బాధపడవద్దు అండగా నేనున్నాంటూ ధైర్యం చెప్పారు. నగర పాలక సంస్థలో పనిచేస్తున్న 100 మందికి పైకా సపాయి కార్మికులకు హెల్త్ అలవెన్సులు రావడం లేదని వారు బి వై రామయ్యకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో వైయస్‌ఆర్‌టిసి అధ్వర్యంలో మేయర్, కమిషనరు ఏ భార్గవ్ తేజలను కలిశారు. ఈసందర్భంగా వారు మేయర్‌తో మాట్లాడుతూ కొందరి నిర్లక్ష్యం వల్ల నగర పాలక సంస్థలో 2020 నుంచి పనిచేస్తున్న 100 మందికి పైగా కార్మికులకు హెల్త్ అలవెన్సులు రావడం లేదని అవేదన వ్యక్తం చేశారు. నగర పాలక సంస్థలో పనిచేస్తు మృతిచెందిన మరియు రిటైర్మెంట్ పొందిన ఐదు మంది కార్మికులు కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని మేయర్‌ను కోరారు. కార్యక్రమంలో వైయస్‌ఆర్ టిసి వైవి రమణ, నాయకులు రేణుక, మహేశ్వరీ, వాణి, స్వాములు, భవాని, శ్రావణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

**మద్దికెర,డిసెంబరు 30,ప్రభాతవార్త :** మండల ప్రాథమికోన్నత పాఠశాల హంప గ్రామంలో 8వ తరగతి చదువుతున్న బాలబాలికలందరికి ప్రభుత్వ ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమం జరిగింది. శుక్రవారం గ్రామ సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి,ఉపసర్పంచ్ తిమ్మన్న, విద్యాకమిటీ చైర్మన్ నారాయణ,మాజీ విద్యాకమిటీ చైర్మన్‌ల చేతుల మీదుగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు.వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేసిందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శాంతి సుధా,ఉపాధ్యాయులు రాంభూపాల్,ప్రకాష్,కమలా,సుధారాణి,లీలావతి, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హుండీ చోరీ యత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

**మాధవరం(మంత్రాలయం),డిసెంబర్ 30,ప్రభాతవార్త:** మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ఉన్న నరసప్ప తాత గుడిలో ఉన్న హుండీ చోరీ యత్నానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కిరణ్ శుక్రవారం విలేకరులకు తెలిపారు.వివరాల మేరకు గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేయగా నిందితుడు కోసిగి గ్రామానికి చె ందిన బాయిగడ్డ కటిక మెహబూబ్ భాషా ఈ చోరీ యత్నానికి పాల్పడినట్లు గుర్తించామన్నారు.కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

## హంద్రీనీవా ద్వారా మార్చి చివరి దాకా సాగునీరు ఇవ్వాల్సిందే..

**దేవనకొండ,డిసెంబరు 30,ప్రభాతవార్త :** హంద్రీనీవా ద్వారా మార్చి చివరి వరకు సాగునీరు ఇవ్వాల్సిందేనని శుక్రవారం అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఎంపిడిఓ కార్యాలయం నందు జరుగుచున్న మండల సర్వసభ్య సమావేశంను అడ్డుకుని బైఠాయించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి నరసారావు,టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్,సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు వీరశేఖర్‌లు మాట్లాడుతూ మండలంలో వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారని హంద్రీనీవా అధికారులు పొంతనలేని జీఓలతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని మార్చి చివరి వరకు సాగునీరు అందిస్తామని హంద్రీనీవా అధికారులు,పాలకుల నుంచి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన అధికారులు మార్చి మొదటివారం దాకా సాగునీరందిస్తామని చెప్పడంతో ధర్నాను విరమించారు. హంద్రీనీవా సుజల స్రవంతి డిఈ గోపినాథ్,ఎంపిపి లక్ష్మీదేవి,ఎంపిడిఓ గౌరీదేవి, వ్యవసాయాధికారి సురేష్‌బాబు హామీ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులు రామారావునాయుడు, రాందాస్‌గౌడ్,భాస్కర్,తిమ్మప్ప,మలకన్న,మల్లికార్జున గౌడ్,నాగేష్,వెంకటరెడ్డి,యూసుఫ్ భాషా, నెట్టికల్,వెంకటస్వామిగౌడ్,రాజగోపాల్ గౌడ్,శ్రీరాములు,నాగేశ్వరరావు, అశోక్,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే రిలయన్స్ ఫౌండేషన్ లక్ష్యం

**ఆలూరు,డిసెంబరు 30,ప్రభాతవార్త :** రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే రిలయన్స్ ఫౌండేషన్ లక్ష్యమని తొలకరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్ సిఈఓ రామాంజినేయులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎ గోనెహాలు గ్రామంలో రైతుల ఉత్పత్తిదారుల కంపెనీ అయిన తొలకరి కంపెనీ 6వ వార్షికోత్సవం కిసాన్ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వరగౌడ్,రైతు ఉత్పత్తిదారుల కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ రామాంజనేయులు,సోమనాథ్‌గౌడ్, శివారెడ్డి,పంపాపతి,రిలయన్స్ ఫౌండేషన్ అధికారులు సురేంద్రనాథ్,కుమారస్వామిరెడ్డి,రేఖరెడ్డి మరియు 20గ్రామాల నుండి తొలకరి సభ్యత్వం ఉన్న రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి నాగరాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలకరి కంపెనీ రూ.15లక్షల వ్యయ పెట్టుబడితో 2016లో ప్రారంభమై నేడు రైతుల పక్షాన ఉంటూ రూ.5కోట్ల వరకు ఎదిగి రైతులకు విత్తనాలు,ఎరువులు,మిర్చి అమ్మకాల ద్వారా వ్యాపారం చేసి తొలకరి కంపెనీ లావాదేవీల సక్రమ నడవడిక నిర్వహణ చూపుతో రైతుల మెప్పు పొందిందన్నారు. అలాంటి కంపెనీ 6వ వార్షికోత్సవం సందర్భంగా కొత్త డైరెక్టర్లను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో 20గ్రామాల రైతులు,ఆర్‌డిపి సంస్థ ప్రతినిధులు తదితరులున్నారు.

## ఘనంగా ఎస్.ఎఫ్.ఐ.ఆవిర్భావ దినోత్సవం

**వెలుగోడు,డిసెంబర్ 30,ప్రభాతవార్త:** స్తానిక జూనియర్ కళాశాలలో ఎస్.ఎఫ్.ఐ.53వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవార ం జిల్లా ఉపాధ్యాక్షులు ఎం.కిషోర్ అధ్యతన ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా కిషోర్ మాట్లాడుతు 1970 సంవత్సరంలో స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం అనే మూడు లక్షలతో పుట్టి నేటికి 53 ఏళ్ళు పూర్తి చేసుకుందని, నిరంతరం విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తునే ఉందని, అతి తక్కువ సమయంలోనే దేశంలో ఎదిగిన విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ. అని ఆయన తెలిపారు. ఎస్.ఎఫ్.ఐ. చేసే పోరాటాలలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్‌నాయక్, గణేష్‌నాయక్, సులోచన, సుగుణమ్మ, శిరీష, నిర్మల తదితరులు పల్గొన్నారు.

## నిత్యన్నదాన వితరణ పథకంనకు దాతలు విరాళం

**శ్రీశైలంప్రాజెక్టు,డిసెంబర్30,ప్రభాతవార్త :** శ్రీశైలం మహపుణ్యక్షేత్రంలో దేవస్థానం ఆద్వార్యంలో నిర్వహిస్తున్న నిత్యన్నదాన వితరణ పథకానికి గుంటూరు వాస్తవ్యులు దేవరశెట్టి వాసవి దంపతులు రూ.1,00,001/-లు విరాళ ముగా దేవస్థానం పర్యవేక్షకులు రవికుమార్‌కు విరాళమును అందజేసారు.ముందుగా శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించు కోని అనంతరం విరాళం అందజేసారు. శ్రీస్వామివార్ల శేషవస్త్రాలతో సత్కరించి లడ్డూ ప్రసాదాలను అందజేసారు.

## టిడిపి నుండి వైసిపిలోకి ఎవ్వరు చేరలేదు

**- తెదేపా మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు**

**తుగ్గలి,డిసెంబరు 30,ప్రభాతవార్త :** తుగ్గలి మండలం ముక్కెళ్ల గ్రామంలోని టిడిపి పార్టీకి చెందిన 16కుటుంబాలు పత్తికొండ ఎమ్మెల్యే సమక్షంలో వైసిపి పార్టీలోకి ఎవ్వరు చేరలేదని వారు ఇదివరకే వైసిపి పార్టీలోనే కొనసాగుతున్నారని తెదేపా మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు,ముక్కెళ్ల నాయకులు గిడ్డయ్య,సర్పంచ్ భర్త రామచంద్ర,మాజీ సర్పంచ్ మునెప్ప,బూత్ కన్వీనర్ మల్లికార్జునలు పేర్కొన్నారు. ఈ వారు విలేకర్లతో మాట్లాడుతూ వైసిపిలోకి చేరిన వారు గతం నుంచే వైసిపి పార్టీలో ఉన్నారన్నారు. ఇదివరకే రెండుసార్లు వైసిపి పార్టీలోకి చేరారని ఒకసారి పగడిరాయిలో మరోసారి కర్నూలులోని పత్తికొండ ఎమ్మెల్యే స్వగృహం నందు వైసిపిలోకి చేరడం జరిగిందని ఇది ఏమాత్రం సబబు కాదన్నారు. వైసిపిలో చేరిన 16కుటుంబాలు తెదేపా పార్టీకి ఎలాంటి సంబంధం లేదని వారికి టిడిపి సభ్యత్వం కూడా లేదన్నారు. వైసిపి గ్రామాల అభివృద్ధిలో వెనుకబడి అసత్య ప్రకటనలతో ముందు వరుసలో ఉన్నారని ఎద్దేవ చేశారు. ఇకనైనా వైసిపి నాయకులు ఇలాంటి అసత్య ప్రకటనలు మాని గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించి ప్రజలకు మరింత మేలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు చిన్న గిడ్డయ్య,లాలప్ప,సుధా, రవి,గిరి,లక్ష్మన్న,స్వామి తదితరులున్నారు.

## కబడ్డీ విజేతలకు బహుమతులు పంపిణి

వెలుగోడు,డిసెంబర్ 30,ప్రభాతవార్త: మండల కేంద్రంలో గత రెండు రోజులుగా నెహ్రు యువ కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. కేంద్ర ప్రభుత్వం వారి భారత క్రీడల మంత్రిత్వశాఖ , నెహ్రుయువ కేంద్రం వారి సహాకారంతో ప్రేరణ రూరల్ డెవలప్‌మెంట్ ప్రశిడెంట్ నూలు నాగేశ్వరరావు అధ్యతన జరిగిన ఈ పోటీలలో విన్నర్స్‌గా ఐ.టి.ఐ.సీల్డ్ టీం కెప్టన్ ఉపేంద్ర, రన్నర్స్‌గా సిద్దాపురం టీం కెప్టెన్ మోహన్‌గా నిలిచారు. గెలిచిన టీంలకు నాగేశ్వరరావు, కీర్తన రూరల్ డెవలప్‌మెంట్ అధ్యక్షులు కె,నగేష్, ఎబివిపి రాష్ట్ర వర్కింగ్ మెంబర్ జి.వీరబ్రహ్మం, బహుమతుల కప్పు, మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ వాలెంటీర్లు రవికిషోర్‌రెడ్డి, సురేష్‌కుమార్, నరసింహ్ములు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## 1న కళాకారుల ఆత్మీయ సమ్మేళన

**నందికొట్కూరు,డిసెంబర్ 30,ప్రభాతవార్త:** స్తానిక అభినవ ఐక్య రంగస్థల కళాసమితి ఆధ్వర్యంలో జనవరి 1వ తేదీన ఉదయం 10 గంటలకు గ్రామీణ కళాకారుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా కళాసమితి సభ్యులు జయరాముడు ఓ ప్రకటనలో తెలిపారు. కావున తాలుకాలోని కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని ఖాదర్‌బాబు, వి.సి.రాజు, వెంకటేశ్వర్లు,గని శ్రీను, బ్రహ్మయ్య కోరారు.

## విద్యాసంస్థల అభివృద్ధి వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యం

**ఆదోని,డిసెంబరు 30,ప్రభాతవార్త :** విద్యాసంస్థల అభివృద్ధి వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమైంది కాబట్టి ప్రభుత్వ విద్యాసంస్థలలో సీట్లు లేవని బోర్డు పెట్టే పరిస్థితి వచ్చిందని వైసిపి నాయకులు లింగప్ప యాదవ్,మహిళా విభాగం నాయకురాలు ప్రజ్ఞలు అన్నారు. శుక్రవారం పట్టణంలో వైసిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి విద్యావ్యవస్థ అనేది అభివృద్ధి పథం వైపు నడిచిందన్నారు. విద్యాసంవత్సరం పూర్తయ్యే దశలో పరీక్షలు ఉండే సమయంలో విద్యాసంస్థలు బంద్ చేయడం విద్యార్థి నాయకుల విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని సమస్య మన కర్నూలు జిల్లాలోనే ఉందా మీరు మీ ప్రయోజనాల కోసం కాకుండ విద్యార్థుల కోసం పాటుపడండి అని వారన్నారు. టిడిపి ప్రభుత్వంలో విద్యార్థులు తక్కువ ఉన్నారనే సాకుతో సంక్షేమ హాస్టళ్లు,పాఠశాలలు ఎన్ని మూసి వేశారో..మీకు తెలియదా..అని వారన్నారు. మనబడి నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని ప్రైవేటు,కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. త్వరలో మా ప్రభుత్వంలోనే మెడికల్ కళాశాల పూర్తవుతుందని అదేవిధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు చేస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్,ఉమేష్, సుధాకర్,రవి తదితరులు పాల్గొన్నారు.

## పల్లెదొడ్డి సచివాలయ కన్వీనర్‌గా జిహెచ్ లక్ష్మీనారాయణ

**దేవనకొండ,డిసెంబరు 30,ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైసిపి సచివాలయాలకు కన్వీనర్లను నియమించడం జరిగింది. అందులో భాగంగా పల్లెదొడ్డి గ్రామ సచివాలయ కన్వీనర్ జిహెచ్ లక్ష్మీనారాయణ ఆలూరులో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. పల్లెదొడ్డి సచివాలయ కన్వీనర్‌గా ఎన్నికైన జిహెచ్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సిఎం జగన్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైసిపి సచివాలయ కన్వీనర్‌గా తనకు అవకాశం కల్పించిన మంత్రి గుమ్మనూరు జయరాం,వారి సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు,నారాయణస్వామి,జడ్‌పిటిసి రామకృష్ణ(కిట్టు),మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జునలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మున్ముందు పార్టీ అభివృద్ధి కోసం తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ఘనంగా ఎస్‌ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**హొళగుంద,డిసెంబరు 30,ప్రభాతవార్త :** ఎస్‌ఎఫ్ఐ 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఎస్‌ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున,మండల కార్యదర్శి పరమేష్,మండల అధ్యక్షులు గురుప్రసాద్‌ల ఆధ్వర్యంలో మండల పరిధిలోని మార్లమడికి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,ఇంగళదహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌ఎఫ్ఐ కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో కేవలం 5మంది విద్యార్థులతో 1970లో స్వాతంత్ర్యం,ప్రజాస్వామ్యం అనే లక్ష్యంతో,చదువు పోరాడు అనే నినాదంతో ఆవిర్భవించిందన్నారు. విద్యార్థుల పక్షాన నిలబడి విద్యార్థుల సమస్యలను పరిష్కరించేవిధంగా విద్యార్థులకు అండగా ముందుకు సాగుతోందన్నారు. ప్రస్తుతం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యవస్థను,విద్యను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. నూతన విద్యావిధానం పేరుతో పాఠశాలలు మూసివేసే దిశగా ప్రభుత్వాలు అధికారాన్ని కొనసాగిస్తున్నారన్నారు. 3,4,5 తరగతుల విలీనం పేరుతో విద్యార్థులను చదువుకు దూరం చేసేలా ఉందన్నారు. పేద విద్యార్థులకు విద్య అనేది అందని ద్రాక్షలా మారిపోయిందన్నారు. కావున తక్షణమే ప్రభుత్వాలు ఈ విలీన ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వీరేష్, పాఠశాల కమిటీ సభ్యులు ఏసేపు,గణేష్,సాదిక్,శ్రీకాంత్,షబీర్,లావణ్య, అయేషా,యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

**పత్తికొండ,డిసెంబరు 30,ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దహుల్తి గ్రామంలో రెండోరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గడప గడపకు తిరుగుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..లేదా..అని అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అంతకుముందు గ్రామస్తులు ఎమ్మెల్యేకు పూలమాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు పార్టీలకు అతీతంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు,వైసిపి నాయకులు,కార్యకర్తలు,గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకుంటేనే సి.యం.లక్ష్యం నెరవురుతుంది

**నందికొట్కూరు,డిసెంబర్ 30,ప్రభాతవార్త:** ప్రతి విద్యార్థి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చే పథకాల ద్వారా ఉన్నత స్థాయికి చేరుకుంటేనే సి.యం.లక్ష్యం నెరవేరుతుందని 26వ వార్డు కౌన్సిలర్ మందడి వాణి అన్నారు. శుక్రవారం స్తానిక సి.యస్.ఐ.పాఠశాలలో ప్రభుత్వం ఇస్తున్న బైజూస్ ఉచిత ట్యాబ్‌లను కౌన్సిలర్ ఎనిమిదవ తరగతి విద్యార్థులకు పంపిణి చేశారు. ప్రభుత్వ పాఠశాలలను వైకాపా ప్రభుత్వం కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా నాడు-నేడు ద్వారా అన్ని హంగులతో విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నదని దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భరత్‌భూషణ్, విద్యా కమిటీ చైర్మన్ యస్.రవికుమార్, వైకాపా నాయకులు ఎం.రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలి

**దేవనకొండ,డిసెంబరు 30,ప్రభాతవార్త :** గ్రామాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా పని చేయాలని ఎంపిపి లక్ష్మీదేవి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపిపి లక్ష్మీదేవి, ఎంపిడిఓ గౌరీదేవిల ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయాధికారి సురేష్‌బాబు మాట్లాడుతూ 2022-23కి ఖరీఫ్ సీజన్‌లో 75వేల ఎకరాలలో పంటలు సాగు చేశారని రబీలో కూడా పంటలు సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంటనమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మురళీమోహన్ మాట్లాడుతూ మండలంలోని 44గ్రామాలకు జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి కొళాయి కనెక్షన్ ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. హౌసింగ్ ఏఈ అనిరుద్‌బాబు మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికి ఇళ్లు భాగంగా మండలానికి 1970ఇళ్లు మంజూరయ్యాయని ఇవన్నీ నిర్మాణం కొనసాగుతున్నాయని అలాగే ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మండలానికి 504ఇళ్లు మంజూరయ్యాయని తెలియజేశారు. విద్యాధికారి రంగస్వామి మాట్లాడుతూ మండలంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని,విద్యార్థులకు 1022ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు తెలియజేశారు. వైద్యాధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కింద 55మందికి రూ.2,51,10,000లతో వైద్యం అందించడం జరిగిందన్నారు. వైస్ ఎంపిపి అశోక్ మాట్లాడుతూ నల్లచెలిమిల గ్రామంలోని పాఠశాలకు ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలని,గ్రామంలో కొత్త విద్యుత్ స్థంబాలు మంజూరు చేయాలని కోరారు. నేలతలమర్రి ఎంపిటిసి విజయభాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ బిందు సేద్యం పరికరాలు ఇన్‌పుట్ సబ్సిడీ రాయితీ కింద తైవాన్ స్ప్రేపంపులు ట్రాక్టర్లు అందించాలని భైరవాణికుంటకు కొత్తపైప్‌లైన్ వేయాలన్నారు. వెలమకూరు సర్పంచ్ భాస్కర్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి కొళాయి కనెక్షన్ వేసి నాలుగు నెలలు కావస్తున్నా బిల్లు రాలేదని వాపోయారు. ఈ సమావేశంలో కెడిసిసి మాజీ బ్యాంక్ డైరెక్టర్ లుముంబా, ఏపిఎం రమేష్,ఈఓపిఆర్‌డి సూర్యనారాయణ,ఏపిఓ కృష్ణమూర్తి,విద్యుత్ శాఖ ఏఈ ఖాజావలి,హంద్రీనీవా డిఈ గోపినాథ్,మండల కార్యాలయపు సూపరింటెండెంట్ ఇద్రుష్‌భాష,అంగన్‌వాడి సూపర్‌వైజర్ సుమిత్ర,వైస్ ఎంపిపి అశోక్,ఎంపిటిసిలు తపాల శ్రీనివాసులు,తిమ్మప్ప,వెంకటలక్ష్మి,నామాల శ్రీనివాసులు,సురేంద్ర, లక్ష్మీదేవి,సర్పంచ్‌లు పద్మావతి,సూర్యప్రకాష్,భాగ్యమ్మ, మహేశ్వర్‌రెడ్డి,సోమశేఖర్‌రెడ్డి,మల్లయ్య,శేసిరెడ్డి, శివరామప్ప,పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

## అంకాళమ్మ వారికి విశేష పూజలు

**శ్రీశైలంప్రాజెక్టు,డిసేంబర్30,ప్రభాతవార్త :** లోక కల్యాణం కోసం శ్రీశైల క్షేత్ర గ్రామ దేవత అయిన శ్రీ అంకాళమ్మ వారికి శుక్రవారంనాడు ఉదయం అభిషేకం,విశేష పూజలను నిర్వహించడం జరిగింది.ప్రతి శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మ వారికి దేవస్థానం సేవగా (సర్కారిసేవగా) ఈ విశేష పూజ జరిపించబడింది.ఇందులో భాగంగా శ్రీ అంకాళమ్మ వారికి అభిషేకం,విశేష అర్చనలు,పుష్పాలంకరణ,కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం,ప్రదాన ఆలయానికి ఎదురుగాగల రహదారిని చివరలో కుడివైపు ఉత్తరముఖంగా ఉంది.చతుర్భుజాలు కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి,సర్పంలో చుట్టబడిన ఢమురుకం ఉండగా,ఎడమవైపున పానపాత్ర,త్రిశూలం ఉన్నాయి.కిరీట ముకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను,కంఠాభరణాలను కలిగి ఉంటుంది.కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహగణపతిపూజ జరిపించబడింది.ఆ తరువాత లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు.అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం,కుంకుమోదకం,గంధోదకం,పుష్పోదకం,విశేషఅబిషేకం అర్చనను నిర్వహించబడ్డాయి.

## బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా తృతీయ స్థానం

**ఆదోని,డిసెంబరు 30,ప్రభాతవార్త :** ఈ నెల 28నుండి 30వ తేదీ శుక్రవారం వరకు శ్రీశైలంలో జరిగిన ఏపిఎస్‌పిడిసిఎల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచిందని ఏడి పురుషోత్తం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 13జట్లు టోర్నీలో పాల్గొనడం జరిగిందన్నారు. తృతీయ స్థానానికి జరిగిన పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు శ్రీశైలం జెన్‌కో జట్టుపై వరుస సెట్లలో గెలిచిందన్నారు. జిల్లా జట్టు తరుపున పాల్గొన్న క్రీడాకారులందరు ఆదోని వారే కావడం గమనార్హం అని కొనియాడారు. ఐదు పదులు దాటిన అంతర్గతంగా దాగి ఉన్న క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి తృతీయ స్థానంలో నిలవడం పట్ల క్రీడాకారులను అభినందించారు.

## 'బహిరంగ ప్రదేశాల్లో న్యూ ఇయర్ వేడుకలు నిషేధం'

**కొలిమిగుండ్ల, డిసెంబరు 30, ప్రభాతవార్త :** కొత్త సంవత్సరం సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించరాదని కొలిమిగుండ్ల ఎస్ఐ రమేష్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. డిసెంబరు-31 రాత్రి నుండి నూతన సంవత్సరం 2023 జనవరి-1 సాయంత్రం వరకు ఎటువంటి సభలు, సమావేశాలు, పార్టీలు నిర్వహించరాదని ఎస్ఐ పెర్కొన్నారు. యువకులు బైక్‌లపై ఇష్టానుసారంగా తిరగడం, రహదారుల్లో కేకులు కట్ చేయడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, బైక్ సైలెన్సర్ తీసివేసి, సౌండ్ చేయడం, గుంపులుగా చేరడం లాంటివి చేపడితే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ రమేష్‌రెడ్డి హెచ్చరించారు. న్యూ ఇయర్ వేడుకలను ఎవరి ఇళ్లలో వారు సంతోషంగా జరుపుకోవాలని ఎస్ఐ సూచించారు. ముఖ్యంగా యువత నిభంధనలు పాటించకుంటే ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా కొలిమిగుండ్ల మండల ప్రజలకు ఎస్ఐ రమేష్‌రెడ్డి ముందస్తు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## తెదేపా అధికారంలో ఉన్నా,ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాసమస్యలపై పోరాటం చేస్తుంది..!

**హొలహర్వి,డిసెంబరు 30,ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా,ప్రతిపక్షంలో ఉన్నా అన్ని వేళలా అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి,అభ్యున్నతికి కృషి చేస్తూ వారి సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుందని టిడిపి మండల కన్వీనర్ సుధాకర్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్ భాద్యతలు చేపట్టిన నాటి నుండి అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ విధ్వంసకర విధానాలతో రాష్ట్రంలోని పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. నిరుద్యోగ యువతకు అండగా ఉండేందుకు తెదేపా హయాంలో ఇచ్చిన రూ.3వేల నిరుద్యోగ బృతిని జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. ఎస్‌సిలకు సంబంధించి 27,బిసిలకు సంబంధించి 30పథకాలు,మైనార్టీలకు సంబంధించి 10 పథకాలు రద్దు చేసి ప్రజలను రోడ్డున పడేశారన్నారు. ఇటువంటి సమయంలో యువతకు అండగా నిలబడాలన్న ఉద్దేశ్యంతో యువత హక్కులు,సమస్యలపై పోరాటం చేసేందుకు తెదేపా యువ నాయకులు,జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జనవరి 27నుండి పాదయాత్రను ప్రారంభిస్తున్నారన్నారు. యువగళం కార్యక్రమానికి పెద్దఎత్తున యువతను సమీకరించి వారికి అండగా నిలబడేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ఇప్పటికే ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు.

## ప్రజా సమస్యలే ధ్యేయంగా 'యువగళం' పాదయాత్ర

**పత్తికొండ,డిసెంబరు 30,ప్రభాతవార్త :** టిడిపి యువ నాయకుడు,తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రజా సమస్యలే ధ్యేయంగా వైకాపా ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలపడానికి యువగళం పేరుతో జనవరి 27వ తేదీన పాదయాత్ర చేపట్టడం జరుగుతుందని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకటరాముడు,జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డిలు తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జ్ కెఈ శ్యాంకుమార్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 400రోజులు 4వేల కి.మీలు కుప్పం నుంచి ప్రారంభమై శ్రీకాకుళం,ఇచ్చాపురం వరకు పాదయాత్ర జరుగనుందన్నారు. ఈ పాదయాత్రను తెదేపా నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి రామానాయుడు,టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మనోహర్ చౌదరి,రవీంద్రనాథ్‌చౌదరి, శివ రాముడు,గుడిసె నరసింహులు,మండల అధ్యక్షుడు సంజప్ప,మాజీ సర్పంచ్ పెద్దహుల్తి తిప్పన్న,విజయమోహన్‌రెడ్డి,బిటి గోవిందు, ఉలివేణి హరి,పట్టణ అధ్యక్షులు సింగం శీను,మీరా హుస్సేన్, శ్రీనివాసులుగౌడ్, దూదేకొండ మోహన్,జూటూరు భాస్కర్‌రెడ్డి,రంగన్న, రామాంజిని,రమేష్, రహంతుల్లా పాల్గొన్నారు.

## నారాలోకేష్ పాదయాత్ర విజయవంతం చేద్దాం..

**దేవనకొండ,డిసెంబరు 30,ప్రభాతవార్త :** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పేరుతో జనవరి 27వ తేదీ నుండి చేపడుతున్న పాదయాత్ర విజయవంతం చేద్దామని టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక తెదేపా కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమం చేపట్టకుండ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను దృష్టిలో పెట్టుకుని నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని కావున నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, రామారావు నాయుడు,ఎంపిటిసి తిమ్మప్ప,మలకన్న,మల్లయ్య,డీలర్ బండ్లయ్య, ఆకుల వీరేష్ ,వెంకటస్వామిగౌడ్, సర్పంచ్‌లు భాస్కర్,శివరామప్ప, వెంకటేష్, రాజాసాహెబ్, నాగేశ్వరరావు,కాశీం, రాఘవేంద్ర,రామాంజనేయులు, నాగేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళండి

**మంత్రాలయం,డిసెంబర్ 30,ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని వాలంటీర్లు,పార్టీ కన్వీనర్లకు వైసిపి సీనియర్ నాయకులు వై.సీతారామిరెడ్డి సూచించారు.శుక్రవారం స్థానిక దుర్గా రమణ కళ్యాణ మండపంలో వాలంటీర్లు,పార్టీ కన్వీనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌ఏ వై.బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు.దేశంలోనే ఎక్కడా లేని విధంగా 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని చెప్పారు .పెన షన్‌లపై అపోహలు వద్దని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందుతుందని సెలవిచ్చారు.వాలంటీర్లు,కన్వీనర్లు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి మా దృష్టికి తీసుకురావాలన్నారు.అనంతరం ఖగ్గల్లు గ్రామ ప్రజలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ళ పట్టాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ భీంరెడ్డి,ఇంఛార్జ్ విశ్వనాథ్‌రెడ్డి,సర్పంచ్ భీమయ్య, మల్లికార్జున,వైస్ ఎంపిపి రాఘవేంద్ర,నాయకులు రోగప్ప,ఉప సర్పంచ్ పరమేష్,ఆయా గ్రామాల సర్పంచ్‌లు,ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలే ధ్యేయంగా పాదయాత్ర

**మద్దికెర,డిసెంబరు 30,ప్రభాతవార్త :** యువ నాయకుడు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రజాసమస్యలే ధ్యేయంగా వైకాపా ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలపడానికి యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టడం జరుగుతుందని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పాదయాత్ర 400రోజులు,4వేల కి.మీ కుప్పం నుంచి ప్రారంభమై శ్రీకాకుళం నుండి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర జరుగనుందన్నారు. ఈ పాదయాత్రకు మద్దతుగా పత్తికొండ నియోజకవర్గ ఇంచార్జ్ కెఈ శ్యాంకుమార్ ఆదేశాల మేరకు లోకేష్ పాదయాత్ర విజయవంతం చేయుటకు మండల టిడిపి నాయకులు,కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు పార విరోభ,పట్టణ అధ్యక్షులు గడ్డం రామాంజనేయులు,మాజీ ఎంపిటిసి పులిశేఖర్,మద్దికెర ఐటిడిపి అధ్యక్షులు భాష,తెలుగు యువత అధ్యక్షులు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులను కాపాడుకుందాం

**నందికొట్కూరు,డిసెంబర్ 30,ప్రభాతవార్త:** కేంద్రం ప్రభుత్వం తెచ్చిన కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్లను రద్దు చేసేంత వరకు పోరాడి కార్మిక హక్కులను కాపాడుకుందామని సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబుల్, రాష్ట్ర ఉపాధ్యాక్షురాలు స్వరూపరాణి పిలుపు నిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగే సిఐటియు మహాసభలను పురస్కారించుకొని చేపట్టిన చైతన్య యాత్ర శుక్రవారం నందికొట్కూరుకు చేరుకుంది. గోపాల్‌క్రిష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైల్వే పోర్టులు, రక్షణ, విద్యుత్ సహా అన్ని రంగాలను ప్రైవేట్ పరం చేయాలని ప్రయత్నిస్తున్నదని, అది జరిగితే ప్రజలపై భారాలు పెరుగుతాయని, కార్పోరేట్‌లకు అధిక లాభాల కోసం ప్రభుత్వాలు యూస్ ఆఫ్ డూయింగ్ అమలు చేస్తున్నాయని వారు తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని, కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు ఐక్య పోరాటాలకు సిద్దం కావాలని వారు పిలుపు నిచ్చారు.సిఐటియు నాయకులు కె.బాస్కర్‌రెడ్డి, గంధం నాగమణి, ఆర్.జయ, నాగన్న, వ్యవసాయ కార్మిక జిల్లా సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత దంత వైద్య పరీక్షలు

**ఆదోనిటౌన్, డిశంబర్30, ప్రభాతవార్త ;** ఇండియన్ మెడికల్, డెంటల్ అసోసియేషన్, లయన్ ్స క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం ఉచిత దంత పరీక్ష శిబిరం నిర్వహించారు. దాదాపు 200 మంది విద్యార్థినీలకు దంత వైద్యులు గోవిందరాజులు, సతీష్, అల్తాఫ్, భీమరాజు, రవికిరణ్ దంత పరీక్షలు నిర్వహించారు. దంత సమస్యలు రాకుండా తీసుకోవాల్సి న జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. ప్రతిరోజూ ఉదయం లేచిన వెంటనే పళ్లను శుభ్రంగా తోముకోవాలన్నారు. వేడి, చల్లటి పదార్థాలను తీసుకోరాదని, ఫ్లోరైడ్ నీటిని తాగితే పళ్లపై పసుపు పచ్చ గారు వస్తుందని, దానికి చికిత్స తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెంట్రల్ వర్ ్క కమిటీ మెంబర్ డా.గోపీనాథ్, స్టేట్‌కమిటీ మెంబర్ డా.క్రిష్ణమూర్తి , అధ్యక్షురాలు ఉషారావు, సెక్రటరీ కిరణ్‌కుమార్, క్లబ్ అధ్యక్షుడు ధర్మారెడ్డి, చైర్మన్ ప్రసాద్‌రావు, సెక్రటరీ వెంకటేష్‌బాబు, సభ్యులు ఓంప్రకాష్, మూర్తి, గోవిందరావు, పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీదేవి పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత ట్యాబ్‌ల పంపిణీ

**గడివేముల, డిశంబర్30, ప్రభాతవార్త ;** మండలంలోని గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారంనాడు 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ట్యాబ్‌లను గ్రామ సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదివే విద్యార్థులకు కంటెంట్ ద్వారా నాణ్యమైన సాంకేతిక విద్య అందించడం కోసం వందల కోట్ల ఖర్చుతో ట్యాబ్‌లను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల్లో చదివే పేద విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు వీటిని కేవలం బోధనాపరమైన అంశాలకే వినియోగించుకోవాలని, ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విమల వసుంధరదేవి, ఎంపీటీసీ జక్కుల సావిత్రి, ఉప సర్పంచ్ గోదప్రసాద్, విద్యాకమిటీ చైర్మన్ వి.శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైకాపా పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు-తెదేపా

**వెల్దుర్తి, డిసెంబర్30, ప్రభాతవార్త :** వైకాపా ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జిల్లా తెదేపా నాయకులు బొమ్మనశివశంకర్‌రెడ్డి, మండల తెదేపా అధ్యక్షులు టి.ఇ.బలరాంగౌడ్ అన్నారు. స్థానిక బొమ్మనశివశంకర్‌రెడ్డి స్వగృహంలో శుక్రవారం తెదేపా అధ్యక్షులు టి.ఇ.బలరాంగౌడ్ అధ్యక్షతన తెదేపా నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముందుగా నెల్లూరు జిల్లాలో తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన తెదేపా కార్యకర్తల కుటుంబాలకు మండల కమిటీ నాయకులు 2 నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు తొక్కిసలాటలో మా పార్టీ కార్యకర్తలు చనిపోతే చంద్రబాబునాయుడు స్పందించి వారి కుటుంబాలకు ఆర్థికసహాయం ప్రకటించి వారికి అండగా నిలుస్తుంటే ఆ విషయాలపై వైకాపా నాయకులు రాజకీయం చేయడం సిగ్గుచేటని వారు అన్నారు. నిరుద్యోగ యువతకు అండగా ఉండేందుకు తెదేపా ప్రభుత్వం నిరుద్యోగభృతి రూ.3వేలు ఇస్తుంటే జగన్ ప్రభుత్వం దాన్ని రద్దు చేసిందన్నారు. మహిళలకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోతుందన్నారు. నిరుపేద వృద్దులకు, వితంతువులు, వికలాంగులకు వచ్చే ఫించన్‌లను వివిధ కారణాలు చూపుతూ తొలగించేందుకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. నారాలోకేష్ యువగళం పేరుతో త్వరలో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న పాదయాత్రలో యువత ఎక్కువగా పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్న లేకున్నా తెలుగుదేశం ప్రజల పక్షాన నిలిచి వారి సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెదేపా నాయకులు బొమ్మనశివశంకర్‌రెడ్డి, మండల తెదేపా అధ్యక్షులు టి.ఇ.బలరాంగౌడ్, తెదేపా ఎస్సీ సెల్ జిల్లా నాయకులు వీరభద్రుడు, నాయకులు మాజీ జడ్పీటిసి ఐజయ్య, నారాయణగౌడ్, రవితేజగౌడ్, చిన్నగోపాల్‌గౌడ్, ఏ.కిట్టు, కె.కిట్టు, రఘుల్‌రెడ్డి, రాఘవేంద్రగౌడ్, ప్రసాద్, అభి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు మార్పు కోరుతున్నారు

**మిడుతూరు, డిశంబర్30, ప్రభాతవార్త ;** ఏపీ పాలనపై ప్రజలు మార్పు కోరుతున్నారని, రాష్ట్ర భవిష్యత్ కోసం యువ నాయుడు నారా లోకేష్ పాదయాత్ర చేపడుతున్నాడని, మాజీ సీఎం చంద్రబాబునాయుడిని సీఎం చేసేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని మండల టీడీపీ కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి అన్నారు. మిడుతూరులో టీడీపీ కార్యాలయంలో టీడీపీ యువ నేత నారా లోకేష్ చేపట్టబోయే 400 రోజులు, 4 వేల కిలోమీటర్ల పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఎక్కడ బహిరంగ సభ పెట్టినా జనం తరలివస్తున్నారని, ఇందుకు కారణం ప్రజావ్యతిరేక నిర్ణయాలేనన్నారు. ధరలు పెరుగుదలతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాలా తీసే పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారి రాష్ట్రం అప్పులపాలై ఆ భారం ప్రజలపై మోపుతున్నారన్నారు. ప్రజా మేలుకొలుపు అనే లక్ష్యంతో యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు మనమంతా మద్దతు పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేంద్రుడు, కలీం, ఇనాయతుల్లా, అర్పల్లి, సలాం తదితరులు పాల్గొన్నారు.

## యువగళం కరపత్రాలను విడుదల చేసిన టీడీపీ నాయకులు




**బనగానపల్లెరూరల్, డిసెంబర్30, ప్రభాతవార్త:** బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని స్థానిక టీడీపీ కార్యాలయం నందు శుక్రవారం యువగళం కరపత్రాలను స్థానిక టీడీపీ నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో 400 రోజులు 4వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు మరియు రైతులకు చేసిన అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఈ పాదయాత్ర చేస్తున్నట్లు వారు తెలిపారు. అదే విధంగా జగన్‌మోహన్‌రెడ్డి నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 25 ఎంపి సీట్లను ఇస్తే అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్రం మెడలు వంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకువస్తానన్నారు. కాని ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి తన కేసుల భయంతో కేంద్రాన్ని ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలను నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలను అడగడానికి భయపడుతున్నారని వారు ఆరోపించారు. అదే విధంగా ప్రతి జనవరికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని యువతకు హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. అదే విధంగా నాడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి రూ.2వేలు ఇచ్చేవారని కాని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నిరుద్యోగభృతిని ఇవ్వడంలేదన్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ లోన్లను కూడా ఈ ప్రభుత్వం ఇవ్వకుండా యువత ఎలాంటి వ్యాపారాలు చేసుకోకుండా చేశారన్నారు. కావునా ఈ యువగళం కార్యక్రమానికి మద్దతుగా యువత పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నంద్యాల జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు, ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య, టీడీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి అత్తార్ జాహీద్ హుస్సేన్, టీడీపీ యువనాయకులు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, నందవరం శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ మాజీ చైర్మన్ పివి కుమార్‌రెడ్డి, పట్టణ ఉపసర్పంచ్ బురాహనుద్దీన్, బనగానపల్లె నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు రాయలసీమ సలాం, టిప్‌టాప్ కలాం, వెల్‌కం ఫోటోస్టూడియో అల్తాఫ్, బనగానపల్లె పట్టణ అధ్యక్షుడు ఖాసీంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సుపరిపాలన అందించడమే వైకాపా ధేయ్యం-ఎమ్మెల్యే శిల్పా

**-ప్రజలల్లో ఎల్లప్పుడు వారితో ఉండడానికి గడపగడప**

**-ప్రజాదరణలో ముందుకు సాగుతున్న ఎమ్మెల్యేశిల్పా**

**వెలుగోడు, డిసెంబరు30, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందించడమే వైకాపా ప్రభుత్వ ధేయ్యమని శ్రీశైల నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శుక్రవారం వెలుగోడు పట్టణంలోని సీపీనగర్‌లో గడపగడప 70వ రోజు కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రాకతో మహిళలు పూలతో భారీ స్వాగతం పలికాగా వార్డు సభ్యురాలు సులోచన, షాదిఖానా కమిటీ అధ్యక్షులు మహమ్మద్ ఖాన్‌లు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమకు ఎంతో మేలు కలుగుతుందని ప్రతి గడపలోనే ప్రజలు అనందాన్ని , సంతోషాన్ని పంచుకున్నారు. శ్రీశైల నియోజకవర్గంలో ఎమ్మెల్యే. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి నవరత్నాలు పేరిటా సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన హామీలను 95 శాతం పూర్తి చేసి దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. గ్రామాలలోని సమస ్యలు గ్రామాలలోనే పరిష్కరించడానికి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి 50 కుటుంబాలకు


ప్రభుత్వం అందించిన లబ్దిని వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఒక వాలంటీర్లను ఏర్పాటు చేసి ప్రజలకు సమానంగా సేవలు అందిస్తూ దేశంలోనే ప్రథమ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డికి ఘనత దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగోడు మేజర్ గ్రామపంచాయితీ సర్పంచ్ వేల్పుల జయపాల్, ఎంపీపీ లాలం రమేష్, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, వైకాపా మండల పట్టణ అధ్యక్షులు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఇలియాస్‌ఖాన్, వైకాపా ప్రధాన కార్యదర్శి రాంమోహన్‌రెడ్డి, దేశం తిరుపంరెడ్డి, ఎంపీటీసీలు శంకర్‌నాయక్, చాంద్‌బాషా, నసురుద్దీన్, రాజేష్ షంషీర్‌అలి, అమీర్ అలి ఖాన్, మోతుకూరు ఎం సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్‌నాయుడు, అసీఫ్ అలి ఖాన్, రైతు సంఘం అధ్యక్షులు తెలుగు వెంకటరమణ, గోవర్ధన్, రఘుస్వామిరెడ్డి, పులి సుబ్బారెడ్డి, వెల్డర్ ఖాదరవలి, వలి, అరీఫ్, గోవిందు, ఫయాజ్ వైకాపా నాయకులు, కార్యకర్తలు, ఎంపీడీఓ అమానుల్లా, అర్‌డబ్ల్యుఎస్ ఏఈ పక్కీరయ్య, ఏఈ రవీంద్రనాయక్, ఏఈఓ సునీతా, అయా సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఆమోస్ కుటుంబాన్ని అన్ని విదాల ఆదుకుంటాం

**గోనెగండ్ల డిశంబరు 30 ప్రభాతవార్త :** హత్యకు గురైన అలువాల ఆమోస్ కుటుంబాన్ని అన్ని విదాల ఆదుకుంటామని ఎపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ పెర్కొన్నారు. ఆమోస్ ఇటీవల కర్నూలు నగరం నందు హత్యకు గురైన సంగతి తెలిసిందే. శుక్రవారం ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అలువాల గ్రామంలోని ఆమోస్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ అలువాల గ్రామానికి చెందిన కుమ్మరి అరుణ, ఆమోస్‌లు ప్రేమించుకున్నారు. అది అరుణ తల్లి దండ్రులకు నచ్చలేదు. దీంతో ఆమోస్ పై కేసు నమోదు చేయించి జైలుకు కూడా పంపారు. అనంతరం అరుణ, ఆమోస్‌లు పెళ్లి చేసుకున్నారు. వీరికి నాలుగేళ్ల కుమారుడు అఖిల్ ఉన్నాడు. ఈ క్రమంలో ఆమోస్ స్నేహితుడు సూర్యప్రదీప్ తో అరుణ అక్రమ సంబందం పెట్టుకుంది. ప్రథకం ప్రకారం ఆమోస్‌ను సూర్యప్రదీప్‌తో ఆరుణ హత్య చేయించినట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే కర్నూలు జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడి నింధితులను అరెస్టు చేయించినట్లు ఆయన తెలిపారు. అరుణ తల్లిదండ్రులను కూడా ఈ హత్యలో ముద్దాయిలుగా చేర్చాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఆమోస్ కుటుంబానికి



ప్రభుత్వం నుంచి రూ.8.50 లక్షలు మంజూరు చేసిందన్నారు. మొదటి విడతగా రూ.4.12.500నగదు చెక్కును మృతుని తల్లిదండ్రులకు ఇచ్చారు. రెండున్నర ఎకరాల భూమి, ఇల్లు, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇస్తున్నట్లు విక్టర్ ప్రసాద్ తెలిపారు. ఆమోస్ కుమారుడు ఆఖిల్ చదువును ఎస్సీ కమిషన్ చూసుకుంటుందన్నారు. ప్రతి గ్రామంలో ఎస్సీలకు ప్రత్యేక శ్మశానం ఇచ్చేందుకు ప్రభుత్వం ఇటీవల కొత్త జీవోను కూడా విడదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు, డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐ మంజునాథ్, తహశీల్దార్ వేణుగోపాల్. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ తిమ్మారెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మూడు కోట్ల దేవతలకు మహావిష్ణువు దర్శనానుగ్రహం

**నంద్యాల హాస్పటల్, డిసెంబరు 30, ప్రభాతవార్తః** ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని రామాయలంలో మూడుకోట్ల దేవతలకు గరుధవాహణరూడుడైన మహావిష్ణువు దర్శనానుగ్రహం ముకో ్కటి ఏకాదశి రోజున ప్రాముఖ్యతను సంతరించుకోవడంతో భక్తులు కిట కిటలాడారు. పట్టణంలోని రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ అధ్వర్యంలో ధనుర్మాసంలో వచ్ ్చ ఈ వైకుఠ ఏకాదశి నాడే వ్రతం అచరించిన వారికి శుభఫలితాలుంటాయని పూజారులు పేరొ ్కన్నారు. శ్రీవైష్ణవులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఏకాదశి వ్రతం అచరించడంతో వైష్ణవదేవాలయాలతో సహా తిరుమల వెంకటేశ్వరుని ఆలయంలోను ఉదయం నుంచి ప్రతే ్యక ఉత్త్ర ద్వారా దర్శనం కలుగుతుందన్నారు. దీనికే వైకుంతద్వారమని ప్రతీతి. సూర్యుడు ఉత్తరాయణ పుణ్యకాల ప్రవేశానికి ఉత్తర ద్వారం శుభసంకేతమని పేర్కొన్నారు. ఈపర్వదినాన విష్ణుపూజా, గీతాపరాయణం, గోవిందనామ స్మరణం, పురాణశ్రవణం, మోక్షప్రాప్తి కలిగిస్తాయని పేర్కొన్నారు. భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారమైన వెంకటేశ్వరస్వామిని అందరు భక్తితో పూజించారు. భగవత్‌సేవా సమాజ్ అధ్వర్యంలో నిర్వాహకులు కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేశారు.

## రూ.1000లు మాత్రమే జేబులో నిల్వ ఉండాలి

**-ఉద్యోగస్థులకు మార్గదర్శకాలు జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వులు**

**నంద్యాల విద్య, డిసెంబరు 30, ప్రభాతవార్తః** రాష్ట్రంలో అవినీతిని రూపుమాపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతే ్యక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే అవినీతిపై శంఖరావం పూరిస్తు ఉదో ్యగులు ఏమాత్రం అవినీతి చేసినా 14400కు కాల్‌చేస్తే వెంటనే స్పందించడం, తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. జిల్లాఓ ఇప్పటికే ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్న అవినీతి అధికారుల చిట్టాలు ఏసిబి చేతిలో చేరుకున్నట్లు సమాచారం. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కూడ జిఓ నం.162ను నూతనంగా విడుదల చేసింది. ఇందులో సివిల్ సర్వీస్ కాండక్టు రూల్స్ 1964 సబ్‌రూల్ 8 (ఎ) మరియు 8 బి రూల్ నం.9 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి పాల్పడకుండా చర్యలుచేపట్టింది. ప్రతి ఉద్యోగి ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి ఉద్యోగంలో వున్నప్పుడు కేవలం రూ.500లకు మించి ఉండకూడదు. టూర్‌లకు ప్రయాణం చేయాలంటే రూ.10 వేలకు మించి తీసుకెళ్ళరాదని నిబంధనలున్నాయి. ఆఫీసు కార్యాలయంలో ఉన్నప్పుడు ప్రభుత్వ నిబంధనల మేరకు రూ.500 నుంచి 1000ల వరకు ఉంచుకోవచ్చుని ఒక్కరూపాయి ఎక్కువగా ఉన్నా అవినీతి కేసు సిద్ధం చేస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం డిజిటల్ పే మెంట్ రూపంలో చెల్లిస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిఒక్కరి వద్ద నగదు రూ.1000లకు మించి ఉండకూడదని ఆ ఉద్యోగంకు ఉదయం విధులకు వచ్చిన సమయంలో లాగ్ బుక్‌లో నమోదుచేయాలని గతంలో ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ఏసిబి డిబి ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఈ అదేశాలు అమలుచేయాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్నిశాఖల ఉద్యోగులు ప్రభుత్వ నిబందనలు తూచతప్పక పాటించాలని పేర్కొన్నారు.

## ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు

**అవుకు, డిసెంబర్30, ప్రభాతవార్త:** అవుకు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో భవన నిర్మాణానికి వెళ్లిన ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు సరైన సేఫ్టీ మేజర్‌మెంట్స్ తీసుకోకపోవడమే వల్లనే ప్రమాదం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు తెలియజేశారు. అవుకు పట్టణంలోని తెలుగుపేటకు చెందిన ప్యాపిలి శ్రీనివాసులు మరియు దాదీ శ్రీనివాసులు శుక్రవారం ప్రభుత్వాసుపత్రిలో బాత్‌రూమ్ గుంత పై బండచప్పట వేయడానికి వెళ్లారు. అక్కడ గుంత దాదాపు 12 అడుగులు ఉంది. దాని పై 6 అడుగుల బండను ఎలాంటి సేఫ్టీ మేజర్‌మెంట్స్ తీసుకోకుండా బండ మధ్యలో ఎలాంటి సపోర్ట్ లేకుండా వాటిని పరచడం వల్ల వాటి మధ్య ఎలాంటి సపోర్ట్ లేకపోవడంతో ఒకేసారి మూడు బండలు అక్కడిక్కడే కూలిపోయాయి. దీంతో కార్మికులకు తీవ్రంగా గాయాలు జరిగాయి. ఈ ప్రమాదానికి కాంట్రాక్టర్లు సరైన సేఫ్టీ మేజర్‌మెంట్స్ తీసుకోకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటమడుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు. 6అడుగుల బండ మధ్యలో ఎలాంటి సపోర్ట్‌లేకుండా వాటిని పరచడం వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలియజేశారు. విషయం తెలుసుకున్న అవుకు జెడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మి, అవుకు ఉపసర్పంచ్ చల్లా రఘునాథరెడ్డిలు వచ్చి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు.

## పాఠశాల తనిఖీ

**కోడుమూరు, డిసెంబర్ 30 (ప్రభాతవార్త) ః** స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొండపేట పాఠశాల ప్రాంగణంలోని భవితా కేంద్రాన్ని శుక్రవారం విలీన విద్యా సమన్వయకర్త ఎస్.గోపినాథ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం భవిత విద్యార్థులతో కలిసి కృత్య నిర్వాహణలో పాల్గొని విద్యార్థులను ప్రొత్స హించారు. ఈయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుశేఖర్‌లు ఉన్నారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు సత్వరమే పరిష్కరించాలి

**నంద్యాల విద్య, డిసెంబరు 30, ప్రభాతవార్తః** జిల్లాలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న వివక్షతను రూపుమాపడంతో పాటు అట్రాసిటి కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషిచేయాలని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ అదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డిఆర్వో పుల్లయ్యతో కలిసి ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుపై జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర ్భంగా కలెక్టరు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు అయిన ఈకమిటీ అట్రాసిటి కేసుల పరిష్కారానికి సమన్వయంతో కృషిచేయాలని తెలిపారు. కొత్తగా జిల్లా ఏర్పడి నాటి నుంచి ఈనెల 22వ తేది వరకు జిల్లాలో 110 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు నమోదు అయ్యాయని ఇందులో 31 కేసులు అసత్య అరోపణలుగా తేలాయన్నారు. పెండింగ్‌లో ఉన్న 46 కేసులతో పాటు మరికొని ్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎఫ్ఆర్ఐ 69 కేసులకు రూ.24.50 లక్షలు నష్టపరిహారాన్ని బాధితులకు అందించినట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన మానిటరింగ్ సభ ్యులు మాట్లాడుతూ అట్రాసిటి కేసులు పెట్టిన వెంటనే కౌంటర్ వేయడం సరైన పద్దతి కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పీ రామాంజినాయక్ మాట్లాడారు. సమావేశంలో అధికారిక సభ్యులైన జయరావు, రాజునాయక్, జయన్నతో పాటు అనధికార సభ్యులైన సంటిగారి దీలిప్‌రాజ్, చిటికెల సలోమి, శ్రీనివాసులు, మమత, జీవన్‌రాజ్, రమేష్, అశోక్‌నాయక్‌తో పాటు సంక్షేమశాఖ డిడి చింతామణి, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీఓలు, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, దాస్‌తో పాటు, డిఎస్పీలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## బీసీల నమ్మకద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి

**- బీసీ సెల్ అధ్యక్షుడు విజయుడు**

**ఓర్వకల్, డిశంబర్30, ప్రభాతవార్త ;** బీసీల నమ్మకద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి అని టీడీపీ పాణ్యం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు విజయుడు విమర్శించారు. ఈ మేరకు టీడీపీ పార్టీ ఆదేశాల మేరకు నన్నూరులో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీసీ కాలనీలో పర్యటిస్తూరజల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన నిధులు మాత్రం సున్నా అని, బీసీ వర్గాలైన నాయిబ్రాహ్మణులు, రజకులు, భవన నిర్మాణ కార్మికులకు తదితర వర్గాలకు ఉపాధి అవకాశాలు లేవని, వారికి వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నంద్యాల పార్లమెంటు మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ ఖాజామియ్య, పాణ్యం మైనార్టీ సెల్ కార్యదర్శి హుసేన్, సర్కార్, మండల మైనార్టీ యూత్ ప్రెసిడెంట్ జాకీర్‌హుసేన్, పార్టీ మైనార్టీ నాయకులు నూర్‌అహ్మద్, షేక్‌షేరా, పార్టీ నాయకులు పెద్దమునిస్వామి, శ్రీరాములు, ముని ఈశ్వరయ్య, డిష్ అంజి, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

**గోనెగండ్ల డిశంబరు 30 ప్రభాతవార్త :** విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని జిల్లా ఎస్ఎఫ్ఐ కమీటి సభ్యుడు వీరన్న, యూటీఎఫ్ నాయకుడు నరసింహులు అన్నారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ సంఘం 53వ ఆవిర్భావ దినోత్స వం ఘనంగా నిర్వహించారు. గోనెగండ్ల జూనియర్ కళాశాల ప్రాంగణం నందు ఎస్ఎఫ్ఐ జెండాను ఎగురువేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాటాలు చేయడమే కాదు, వాటిని విజయాలవైపుకు తీసుకువెలుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నందికుమార్, మురళి, ఆశోక్‌నాయుడు, ఖాజా, బాబు, చంద్రపాల్, రామన్, జిక్రియా, రామకృష్ణ, మోహన్, మంజునాథ్, చత్రపతి, ఉదయ్, చిరంజీవి, షాహిద్, మునిస్వామి, సమీర్ పాల్గొన్నారు.

## క్రీడా దినోత్సవ వేడుకల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు

**కర్నూలు మున్సిపల్, డిసెంబరు 30, ప్రభాతవార్తః** స్థానిక మాధవనగర్‌లోని శ్రీచైతన్య కరూ ్నలు-4 బ్రాంచ్ పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు క్రీడాదినోత ్సవాన్ని జ్ఞా ్నపకం చేసుకొని నిర్వహించిన కార్యక్రమాల్లో, క్రీడాపోటీల్లో , వ్యాసరచనల్లో ఎంపికైన విద్యార్థులకు ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కర్నూలు శ్రీచైతన్య స్కూల్ ఎజిఎం సురేష్ పాల్గొని కాగడ వెలిగించి విద్యార్థులు చదువుతో పాటు శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. అర్ఐ రామాంజనేయులు కో-ఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెహమూద, డీన్ దామోదర్‌లు క్రీడాదినోత్సవ ప్రాముఖ్యతను తెలిపి విద్యార్థులకు ప్రశంసపత్రాలు, మెడల్స్‌ని అందజేశారు. ఇన్‌చార్జీలు కృష్ణవేణి, రోజ, వా ్యయామ ఉపాధ్యాయుడు శివకుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లి దండ్రులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## కౌతాళంకు రెగ్యులర్ ఎంఈఓను నియమించాలి

**కౌతాళం, డిశంబర్30, ప్రభాతవార్త ;** కౌతాళం మండలానికి రెగ్యులర్ ఎంఈఓను నియమించాలని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యుడు మహేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓను కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే మండలంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై డీఈఓకు వివరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఈఓ హామీ ఇచ్చినట్లు మహేష్ తెలిపాడు.

## నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



**బనగానపల్లె, డిసెంబర్30, ప్రభాతవార్త:** బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో పట్టణంలోని కార్పెంటర్స్ కాలనీకి చెందిన కార్పెంటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శు క్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో ముస్లిం మైనార్టీ కుటుంబాలు ఎక్కువ శాతం కార్పెంటర్లుగా, గౌండా వృత్తి చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే కార్పెంటర్ వృత్తి చేసుకునే వారికి సొంత స్థలం లేకుండా అద్దె స్థలాల్లో ఉండి తమ వృత్తిని సాగిస్తున్నారని వారి సమస్యలను తమ దృష్టికి తీసుకురావడంతో వెంటనే పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా అన్ని పార్టీలకు చెందిన వారికి కార్పెంటర్ వృత్తి చేసుకునే వారికి గ్రామ పంచాయతీకి సమీపంలో జుర్రేరువాగు వద్ద ఉచితంగా స్థలాలు కేటాయించడం జరిగిందని ఇప్పుడు అది ఒక వాణిజ్య సముదాయంగా ఉందని అందరు కలిసిమెలసి పనులు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో ప్రజల కోసం నిత్యం కష్టపడే నాయకుడికి మీ అమూల్యమైన ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చాంద్‌బాషా, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ హుస్సేన్, మహబూబ్ బాషా, ఖాదర్ బాషా, ఇబ్రహీమ్, రాంమోహన్ ఆచారి, గోవిందయ్య ఆచారి, అబ్దుల్ అలీమ్, ఖాజం హుస్సేన్, అబ్దుల్ బాసిత్, మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం పట్టివేత... ఇద్దరు అరెస్ట్

**ఆదోనిటౌన్, డిశంబర్30, ప్రభాతవార్త ;** అక్రమంగా కర్ణాటక మద్యాన్ని కలిగి ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ హరిక్రిష్ణ శుక్రవారం విలేకరులకు తెలిపారు. కౌతాళం గ్రామంలో బోయ గురురాజ్ వద్ద 58 కర్ణాటక మద్యం ప్యాకెట్లు గుర్తించి అరెస్టు చేశామన్ననరు. అలాగే ఆదోని పట్టణంలోని ఇందిరానగర్‌లో అంజినమ్మ అనే మహిళ వద్ద 90 కర్ణాటక మద్యం ప్యాకెట్లు గుర్తించి ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యాన్ని కలిగి ఉన్నా, విక్రయించినా, సరఫరా చేసినా అలాంటి వారిపై కేసులు నమోయి చేసి రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐ శివప్రసాద్, ఆదోని డీటీఎఫ్ ఎస్ఐ స్వామినాథన్, ఇంటెలిజెన్స్ పీసీ సోమేష్, సిబ్బంది ఉన్నారు.

## ముక్కెళ్లలో టిడిపి నుండి వైసిపిలోకి చేరిక

**తుగ్గలి, డిసెంబరు 30, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ముక్కెళ్ల గ్రామానికి చెందిన పలువురు టిడిపి కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే శ్రీదేవమ్మ సమక్షంలో వైసిపి పార్టీలో చేరారు. టిడిపి నుండి వైసిపిలోకి కోయిలకొండ కాసీం, నడిపి లక్ష్మన్న, శ్రీరాములు, ఆదోని రామాంజనేయులు, అంజినయ్య, కోయిలకొండ శేఖర్, ఆదోని రాజశేఖర్, జయమ్మ, కోయిలకొండ గోవిందమ్మ, ఆదోని కాశమ్మ, గిరి మూర్తి, ఆదోని రాజేష్, కోయిలకొండ రామాంజనేయులు, లక్ష్మీదేవి, అంజలి, రాజేశ్వరి తదితరులు మొత్తం 16కుటుంబాలు వైసిపి పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ఎర్రగుడి రామచంద్రరెడ్డి, మండల కన్వీనర్ జిట్టా నాగేష్, జడ్‌పిటిసి పులికొండ నాయక్, వైసిపి నాయకులు మల్లికార్జునరెడ్డి, ఉమా మహేశ్వర్‌రెడ్డి, శభాష్‌పురం రాఘవరెడ్డి, ముక్కెళ్ల చంద్రన్న, సింగిల్‌విండో డైరెక్టర్ గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

## పదోతరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి-ఏపిసిఃడాక్టర్.వేణుగోపాల

**వెల్దుర్తి, డిసెంబర్30, ప్రభాతవార్త :** పదోతరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఏపిసి(అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, సమగ్ర శిక్ష కర్నూలు) డాక్టర్.వేణుగోపాల్ అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణ సమీపంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఆయన జిసిడిఓ సునీతతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం 8వ తరగతి విద్యార్థి, విద్యార్థులకు విలువైన ట్యాబ్‌లు, స్టడీ మెటీరియల్‌ను అందజేసిందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాని ్న ఉపయోగించుకొని భోధన సామార్థ్యాలను అభివృద్ధి చేసుకొని మారుతున్న వైజ్ఞానిక, సాంకేతికతలకు అనుగుణంగా పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. పాఠశాలలో మౌలికవసతులపై ఎస్ఓ షాకీరాబేగంను అడిగి తెలుసుకున్నారు. వెల్దుర్తి మండలానికి 1171 ట్యాబ్‌లు వచ్చాయన్నారు. విద్యార్థులతో కలిసి వారు సహాపంక్తి భోజనం చేశారు. అనంతరం ఎంఇఓ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యాలయంలో పని ఎక్కువగా ఉన్న సమయంలో సిబ్బంది త్వరగా వచ్చి పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు.

## నేడు నెరుడుప్పలలో పక్కిరయ్యస్వామి ఉరుసు

**గోనెగండ్ల డిశంబరు 30 ప్రభాతవార్త :** మండల పరిధిలోని నెరుడుప్పల గ్రామంలో శనివారం పక్కిరయ్యస్వామి ఉరుసు మహోత్సవం జరుగుతున్నట్లు నిర్వహికులు గ్రామ సర్పంచ్ భీమక్క, హరిచంద్రరెడ్డి తెలిపారు. 31వ తేదీన ఉరుసు, జనవరి 1వ తేదీన జాయారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. స్వామి వారిని దర్శించేకునేందుకు శనివారం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి వస్తున్నట్లు గ్రామ టీడీపీ నాయకులు రామాంజినేయులు తెలిపారు. టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో పంచమాకాల ఉచిత నాటక ప్రదర్శనం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

## మెనూ ప్రకరాం భోజనంను అందించండి

**గూడూరు, డిసెంబర్ 30 (ప్రభాతవార్త) ః** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెన్యూ ప్రకారం మధ్యాహ్నం భోజనం అందించాలని గూడూరు తాహశీల్దార్ శివరాముడు తెలిపారు. శుక్రవారం గూడూరు మండలంలోని గుడిపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించే మధ్యాహ్న భోజన పథకాన్ని పరశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని, విద్యార్థలకు మంచి ఆహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో విర్వోలు తిమ్మన్న, గోపాల్, ఆర్ఐలు పాల్గొన్నారు.

## న్యూఇయర్ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే బీసీ దూరం

**బనగానపల్లెరూరల్, డిసెంబర్30, ప్రభాతవార్త:** బనగానపల్లె నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి ఆయన సతీమణి, రాష్ట్ర థాయ్‌బాక్సింగ్ చైర్‌పర్సన్ బీసీ ఇందిరారెడ్డి, బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిలు నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీసీ అభిమానులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాల్సిందిగా వారు కోరారు. అదే విధంగా ముందుగా వారు నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అందరు కుటుంబ సభ ్యలతో సంతోషంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని అలాగే మీ జీవితం కొత్త సంవత్సరంలో సుఖసంతోషాలతో, సకల సౌభాగ్యాలతో ఉండాలని వారు ఆకాక్షించారు.

## తిరుమలకు బయలుదేరిన మాలాధారులు

**బేతంచెర్ల, డిసెంబర్30, ప్రభాతవార్త:** కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి క్షేత్రానికి వెంకటేశ్వరస్వామి మాలాధారులు శుక్రవారం ఇరుముడితో బయలుదేరారు. గురుస్వాములు డాక్టర్ వెంకటరమణ గౌడ్, శ్రీనివాసుల ఆధ్వర్యంలో ఇరుముడిని ఎత్తుకున్న మాలాధారులు స్వామివారి నామస్మరణ చేస్తూ తిరుమలకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ నంద్యాల జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి, వెంకటరమణ, మాలాధారుల బంధువులు పాల్గొన్నారు.

## శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవ

**శ్రీశైలంప్రాజెక్టు,డిసేంబర్30,ప్రభాతవార్త :** లోక కల్యాణం కొసం దేవస్థానం శుక్రవారంనాడు సాయంకాలం శ్రీస్వామిఅమ్మవార్లకు దేవస్థానం ఊయల సేవ వైభవంగా నిర్వహించడం జరిగింది.ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి,మూలా నక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించబడుతోంది. కాగా ఈ రోజు లక్షకుంకుమార్చన తరువాత ఈ ఈఊయల సేవను జరిపించబడింది.ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకలా ్యణాన్నికాంక్షిసూ్త అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు.తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడింది.అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడపచార పూజ జరిపించబడింది.ఆ తరువాత విశేషంగా అమ్మవారికి అష్టోత్తరం,త్రిశతి,ఖడ్గమాల, సహస్ర నామపూజలు,స్వామివారికి సహస్రనామార్చన జరిపించబడింది.చివరగా ఊయలసేవ నిర్వహించబడింది. ఊయలసేవను పురస్కరించుకోని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పలంకరణ,పుష్పార్చనలు జరిపించబడ్డాయి.

## సచివాలయ కన్వినర్లను నియమించిన ఎమ్మెల్యే



కన్వినర్లతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే

**మద్దికెర,డిసెంబరు 30,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మద్దికెరలో పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మండలంలోని వివిధ సచివాలయాలకు కన్వినర్లను నియమించి వారితో ప్రమాణస్వీకారం చేయించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ గ్రామాల పరిధిలోని వార్డులో పనిచేసే వాలంటరీలు,సచివాలయ కన్వినర్లు సమన్వయంతో పనిచేసి అన్ని అంశాల్లోనూ ప్రజలతో మమేకం కావాలన్నారు. కన్వినర్లు పార్టీ కోసం నిక్కచ్చిగా పనిచేసి గృహ సారథులను ఎంపిక చేయాలన్నారు. ప్రజల కోసం పనిచేసే వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. మండల నాయకులు మాట్లాడుతూ సైకిల్ గుజిరికి పోయేకాలం దగ్గర పడిందన్నారు. ఇదేమి ఖర్మ ఈ పచ్చ నాయకులకు అని ప్రజలు అసహించుకుంటున్నారన్నారు. మండలంలో అభివృద్ధి ఎన్నడూ లేని విధంగా జరిగిందన్నారు. త్వరలో బురుజుల రోడ్డు గ్రామాలలో ఉండే రోడ్లన్నీ పూర్తవుతాయని అన్నారు. సభపై ఉన్న ప్రతి వైసిపి నాయకుడు రాష్ట్రంలో టిడిపి చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎండగట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,వైసిపి నాయకులు, కార్యకర్తలు,వాలంటరీలు పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర బ్యాగ్ లిఫ్టింగ్ ముఠా(గ్యాంగ్) అరెస్ట్

-ఏడు తులాలు బంగారు, 30 తులాల వెండి స్వాధీనం



జిల్లా ఎస్పీ సమక్షంలో ముద్దాయిలు

**నందికొట్కూరు,డిసెంబర్ 30,ప్రభాతవార్త:** పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద అంతరాష్ట్ర బ్యాగ్ లిఫ్టింగ్ ముఠాను నందికొట్కూరు పట్టణ సి.ఐ.విజయబాస్కర్ మరియు సిబ్బంది అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు నందికొట్కూరు అర్బన్ పి.ఎస్.క్రైం నెం.105/2022, యు/సెక్షన్ 379 ఐపిసి కేసులోని ముద్దాయిల కోసం తీవ్రంగా గాలిస్తుండంగా శుక్రవారం ఉదయం మార్కెట్‌యార్డు వద్ద ఉన్నట్లుగా సమాచారం అందడంతో సి.ఐ. సిబ్బందితో వెళ్ళి అరెస్టు చేసి నందికొట్కూరు పోలీసు స్టేషన్ మరియు ఆళ్ళగడ్డ పోలీసు స్టేషన్లలోని కేసులలో అనంతపురం జిలా కదిరికి చెందిన వనార్చి కోటయ్య, జలపతి చిన్న నరసింహ్ములు, జలపతి రాములమ్మ దొంగలించబడిన ప్రాపర్టిని వారి నుండి స్వాధీనం చేసుకొని పంచాయితిదారుల సమక్షంలో పంచనామా ద్వారా వాటిని సీజ్ చేసినట్లుగా సి.ఐ.తెలిపారు. రికవరీ అయిన ప్రాపర్టి బంగారు నెక్లెస్ 02 తులాలు, బంగారు గొలుసు ఒకటిన్నర తొలం, బంగారు కమ్మలు అర తులం, వెండి పట్టీలు 10 తులాలు, వెండి మొలతాడు సుమారు 10 తులాలు, చిన్న పిల్లల వెండి కడియాలు సుమారు 10 తులాలు స్వాధీనం చేసుకున్ననట్లుగా సి.ఐ.తెలిపారు. ముద్దాలను నంద్యాల జిల్లా ఎస్పీ ఎదుట హాజరు పర్చినట్లుగా తెలిపారు.

## అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**బనగానపల్లె,డిసెంబర్30,ప్రభాతవార్త:** కర్నూలు జిల్లాతో పాటు కడప,అనంతపురం,ప్రకాశం జిల్లాల్లో గత ఏడాదిగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాకు బనగానపల్లె పోలీసులు చెక్ పెట్టారు.వివరాల్లోకి వెళితే నంద్యాల జిల్లా బనగానపల్లె పోలీస్ సర్కిల్ పరిధిలోని అవుకు మండల కేంద్రంలో అంతరాష్ట్ర దొంగల ముఠాకు చెందిన ముగ్గురు వ్యక్తులను శుక్రవారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేశారు.ఇటీవల బనగానపల్లె సర్కిల్ పరిధిలో వరుస దొంగతనాలు చేస్తూ ప్రజలను కంటికి నిద్ర లేకుండా దొంగలు హల్‌చల్ చేస్తుండడంతో దీన్ని సవాల్‌గా తీసుకున్న బనగానపల్లె సీఐ సుబ్బరాయుడు నేతృత్వంలో బనగానపల్లె, అవుకు ఎస్ఐలు మూడు టీంలుగా ఏర్పడి శుక్రవారం ఉదయం అవుకు శివార్లలోని ఉప్పలపాడు ఆర్చి వద్ద దొంగతనాలకు పాల్పడుతున్న గుత్తికొండ పవన్ కుమార్ అలియాస్ కార్తీక్,వేముల శివశంకర్ అలియాస్ రాజు,తలారి మారెన్న అనే అంతరాష్ట్ర ముఠాకు చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు.అరెస్ట్ అయిన వారి వద్ద నుండి నాలుగు జిల్లాల్లో 19 వివిధ దొంగతనాల్లో దోచుకున్న రూ.50.85లక్షల విలువ గల 1.13కేజీల బంగారు ఆభరణాలను,రూ.5.75లక్షల నగదు,రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఏడాది జనవరి నెల నుంచి ఇప్పటి వరకు వారు రాష్ట్రంలో జరిగిన పలు దొంగతనాలకు పాల్పడినట్లు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి ఎస్పీ కార్యాలయంలో మీడియాకు తెలిపారు.అత్యంత చాకచక్యంగా వ్యవహరించి అంతరాష్ట్ర దొంగల ముఠాను పట్టుకోవడంలో నేర్పు ప్రదర్శించిన బనగానపల్లె సీఐ సుబ్బరాయుడు,అవుకు ఎస్ఐ జగదీశ్వరరెడ్డి,బనగానపల్లె,అవుకు పోలీస్ సిబ్బంది జిలానీ బాషా,ప్రసాద్,సుబ్బరామకృష్ణ,ప్రవీణ్ కుమార్,హోంగార్డు రఫీలను జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు.



## అట్లహాసంగా సచివాలయ కన్వినర్లు ప్రమాణ స్వీకారం

**తుగ్గలి,డిసెంబరు 30,ప్రభాతవార్త :** సిఎం జగనన్న ఎంతో ప్రతిష్టాత్మకంగా స్థాపించిన సచివాలయ సేవలు ఎనలేనివని,ప్రభుత్వ సేవలను వాలంటరీలు ఇంటింటికి తిరిగి ప్రజలకి అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే శ్రీదేవమ్మ పేర్కొన్నారు. శుక్రవారం తుగ్గలిలోని గ్రామ సచివాలయ వాలంటరీలతో పాటు నూతనంగా ఎంపికైన సచివాలయ కన్వినర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతనంగా ఎంపికైన సచివాలయ కన్వినర్లతో ఎమ్మెల్యే శ్రీదేవమ్మ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో గడిచిన మూడున్నరేళ్లలో ప్రతి ఇంటికి అందించిన సంక్షేమ పథకాలను వాలంటరీలు, సచివాలయ కన్వినర్లు ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి తెలియజేయాలన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి ఇతర రాష్ట్రాల్లో గొప్పగా చెప్పుకుంటున్నారన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలనే కాకుండ ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తూ జగనన్న పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు పాలన సాగిస్తుందన్నారు. మోసపూరిత వాగ్దానాల మాజీ సిఎం,టిడిపి అధినేత చంద్రబాబునాయుడు,ఆయన ప్యాకేజీ పుత్రుడు జనసేన పవన్ కళ్యాణ్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. అందువల్ల రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎన్నుకోవడానికి ప్రజలందరు ఆశీర్వదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్‌పర్సన్ విజయలక్ష్మి,జడ్‌పిటిసి పులికొండ నాయక్,వైస్ ఎంపిపిలు మల్లికార్జునరెడ్డి,ఎర్రనాగప్ప,మండల పరిషత్ కోఆప్షన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీదేవమ్మ

సభ్యులు చాంద్‌భాషా, మాజీ ఎంపిపి భూలక్ష్మి,సర్పంచ్‌లు కమల్,మునేంద్ర,వైసిపి మండల కన్వీనర్ జిట్టా నాగేష్ యాదవ్,వైసిపి నాయకులు ఎర్రగుడి రామాచంద్రారెడ్డి, రాతన మోహన్‌రెడ్డి,తుగ్గలి మోహన్‌రెడ్డి,తుగ్గలి చం ద్రశేఖర్‌రెడ్డి,నారాయణ నాయక్, ఉప్పరపల్లి సురేంద్రనాథ్‌రెడ్డి,రామకొండ చంద్రశేఖర్‌రెడ్డి,మధు,శభాష్‌పురం హనుమంతు, జొన్నగిరి రఘు,నాగభూషణ్ రెడ్డి,రామలింగయ్యపల్లి రంగనాథ్‌రెడ్డి,శభాష్‌పురం గుట్టపల్లి రవి,రాఘవరెడ్డి, మారెళ్ల సుధాకర్‌రెడ్డి,పెండేకల్ బసిరెడ్డి,నునసురాల గోపాల్‌రెడ్డి, బొందిమడుగుల ఈశ్వర్‌రెడ్డి,మామిళ్లకుంట హనుమంత్‌రెడ్డి,లంకాయపల్లి హనుమంతరెడ్డి,గిరిగట్ల విష్ణువర్ధన్‌రెడ్డి,శభాష్‌పురం రవి,ముక్కెళ్ల వెంకటేష్,చంద్రన్న, గిడ్డయ్య,లక్ష్మణస్వామి,రంగడు,మెకానిక్ మునెప్ప,చిరంజీవి, చంద్ర,ఎద్దులదొడ్డి హరిచంద్రప్ప,మామలకుంట సత్తప్ప,రాంపురం గంగాధర్, గోవిందరాజులు,ఓబులేషు, కొట్టేలా హుస్సేన్‌భాష,చెన్నంపల్లి సుంకన్న,రంజాన్, భీమానాయక్, రామునాయక్,బాబునాయక్,అశోక్ నాయక్, వాలంటరీలు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్ముడు కళలు కన్న గ్రామ స్వరాజ్యము జగన్‌కే సాధ్యము

**బిజినవేముల(కోవెలకుంట్ల),డిశంబరు 30,ప్రభాతవార్త**

పూజ్య బాపూజీ గాందీమహాత్ముడు కళలు కన్న గ్రామ స్వరాజ్య పాలన ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని యంయల్ఎ కాటసాని.రామిరెడ్డి చెప్పారు. పల్లెల్లోని ప్రజలకు పరిపానల వారి వద్దకే చేరవేయడానికి నాటి గాందిజీ ఎన్నో కళలు కన్నాడని మన దేశంలో దానిని సాద ్యము చేయడానికి ఎవరూ సాహసించలేదని కాని ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఎంతో పెద్దమనస్సుతో సాధ్యము చేశాడు అందులో బాగంగా గ్రామాల్లోనే పరిపాలనకు సంబందించిన సచివాలయాలు వ్యవసాయ అపీసులను ఏర్పాటు చేసి ఎక్కడి ప్రజలు అక్కడే తమ అవసరాలు తీర్చుకునే విదముగా సచివాలయాలను అర్బికేలను ఏర్పాటు చేశారు.అందులో బాగంగా మండల పరిదిలో రూ 56.80లక్షలతో నిర్మించిన సచివాలయ మును,అలాగే అర్బికేలను శుక్రవారము సాయంత్రము 5గంటలకు యంయల్ఎ కాటసానిరామిరెడ్డి యంపిపి భీమిరెడ్డి రమాదేవితో కలిసి లాంచనంగా ప్రారంబించారు. ఈసందర్భముగా అయన అక్కడే ఏర్పాటు చేసిన విలేకర్లతో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఏదైన చెప్పితే చేస్తారని అది ఎంత



కష్టమైన వెనుక అడగు వేసే ప్రసక్తి లేదన్నారు. అందులో బాగంగా నాటి మహాత్ముడు పూజ్యబాపూజీ కళలు కన్న గ్రామా స్వరాజ్య పాలను ప్రజలకు అందించాడని చెప్పారు. అందులో బాగంగా ప్రతి చోట లక్షలు ఖర్చు చేసి మీనీ సచివాలయాలను కట్టిస్తున్నాడని చెప్పారు. బినిజవేముల గ్రామంలో రూ 35లక్షతతో సచివాలయం,అలాగే రూ 21.80లక్షలతో అర్బికేని నిర్మించారని చెప్పారు. చెప్పి విదముగా పి ంచనుల కోసమే లక్షి 73కోట్లు వేచ్చిస్తున్నాడని చెప్పారు. అలాగే నాడు నేడు కింద అన్ని చోట్ల విద్యాలయాల రూపే రేఖలను మారు ్చతున్నాడని చెప్పారు.అలాగే రైతుల కోసంభీమాను ప్రభుత్వమే చెల్లించి ఏకంగా ఒక్క బిజినవేముల గ్రామంలోనే రూ కోట్టి పరిహారము అందించామని చెప్పారు.అలాగే సంక్షేమము ఒక వైపు అబివృద్ది మరోవైపు చేస్తు గ్రామాల్లో సిసిరోడ్డు,డ్రైనేజి, ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.అందుకు 2024లో కూడా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల పార్టి అద్యక్షులు భీమిరెడ్డి ప్రతాపరెడ్డి వెలటూరు సర్పంచు యల్‌విసుదాకరరెడ్డి, మారంరెడ్డి బాస్కరరెడ్డి రాంమోహన్‌రెడ్డి, చిక్కేపల్లె ప్రసాదరెడ్డి కోవెలకుంట్ల ఉపసర్పంచు సూర్యనారాయణరెడ్డి, యన్‌జిఓ సంఘం మాజీ రాష్ట్ర ఉపాద్యాక్షులు గువ్వలరామకృష్ణారెడ్డి, అమడాల సర్పంచులు మద్దిలేటి, బిసి నాయకుడు అమడాలశంఖరయ్య , యంపిడిఓ మహమ్మద్‌దౌలా, ఈఓపిర్డి రాదిక, పంచాయితీ సెక్రటరీ సురేంద్రనాదరెడ్డి,గుంజలపాడు రామసుబ్బారెడ్డి, లింగాల.శేషిరెడ్డి, తదితరులు పాల్గొనా ్నరు.

## సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం ; ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిలీగల్, డిశంబర్30, ప్రభాతవార్త ; ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాయనగర్‌లో జరిగింది. వార్డుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా అధికారులకు ఆదేశాలిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు కనిపిస్తుందన్నారు. ప్రతి గడపలోనూ ఆప్యాయత అనురాగం ప్రజలు చూపిస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత రాష్ట్ర ప్రజల కష్టాలు తీరుస్తూ అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, రైతులకు పంట నష్టపరిహారం, ఆటో కార్మికులకు చేనేతలకు అనేక వర్గాల వారికి సంక్షేమ పథకాలను అందిస్తూ ముందుకెళ్లడం జరిగిందన్నారు. ప్రజల ఆశీస్సులతో 2024లో కూడా మన రాష్ట్రానికి సీఎంగా మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు బి.దేవా, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ మధుసూదన్, పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, జమీల్, షఫీ, మహేష్, ప్రసాద్, రాజేంద్రప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, మదన్, ఫయాజ్, సురేష్, లాల్‌బాషా, యేసోబు, తాయన్న, డైరెక్టర్‌లు అమాద్‌బాషా, మంజుల, రేణుక, కౌన్సిలర్, వరలక్ష్మి, శ్రీలక్ష్మి, రామలింగేశ్వర్, రైల్వే ఈరన్న, దానం కామాక్షి, తిమ్మప్ప, ఈరన్న, శీన, నాగరాజు, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెంకాయ్య పల్లె ఎల్లమ్మను దర్శించుకున్న

టిటిడి బోర్డు మెంబర్ మురంశెట్టి రాములు



**కర్నూలు రూరల్, డిసెంబర్ 30, ప్రభాతవార్త :** కర్నూలు మండలం వెంకాయ్యపల్లెలో వెలసిన శ్రీ ఎల్లమ్మను టిటిడి పాలకమండలి సభ్యులుమురంశెట్టి రాములు శుక్రవారం దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఆయనకు దేవస్థానం చైర్మన్ బేతం.కృష్ణుడు,ఆలయ ఇఒ సీతారామిరెడ్డి మురం శెట్టి రాములుకు, ఆయనతోపాటు వచ్చిన ఇల్లూరు లక్ష్మయ్యకు ప్రతే ్యక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన చైర్మన్, ఇఒ వారికి అమ్మవారి చిత్రపటం, నిమ్మకాయల దండ, తీర్థప్రసాదాలు అందజేశారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించండి

– ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



**బనగానపల్లె,డిసెంబర్30,ప్రభాతవార్త:** బనగానపల్లె నియోజకవర్గ శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి స్వగృహంలో మార్చినెలలో జరిగబోయే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికలు జరగనున ్న సందర్భంగా ఎన్నికల ప్రచార గోడపత్రికలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆవిష్కరించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ మార్చి నెలలో జరగబోయే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థుల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి వైఎస్సార్‌సీపీపిని గెలిపించాలని బనగానపల్లె నియోజకవర్గంలోని పట్టభద్రులందరికి ఆయన పిలుపునిచ్చారు.వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పరిపాలన కొనసాగాలంటే శాసనసభ పక్షంతోపాటు శాసన మండలి సభ కూడా వైఎస్సార్‌సీపీకి అవసరం కాబట్టి శాసన మండలి సభ్యులను కూడా ఎన్నుకోవాల్సిన అవసరం పట్టభద్రులకు ఉంది.కావునా పెద్దల సభకు వెన్నపూస రవీంద్రారెడ్డిని పంపించాలని బనగానపల్లె నియోజకవర్గ పట్టభద్రులకు ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార కార్యదర్శులు శ్రీనివాసులు,సుధాకర్,భరత్,అనిల్‌తోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ముచ్చుమర్రి నాగేశ్వరావు అనుమానాస్పద మృతి

**నందికొట్కూరు,డిసెంబర్ 30,ప్రభాతవార్త:** పట్టణంలోని జీవనజ్యోతి సమీపంలో కొత్తముచ్చుమర్రి గ్రామానికి చెందిన బోయ నాగేశ్వరరావు (52) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం అటుగా వెళుతున్న కొంత మంది శవాన్ని చూచి పోలీసులకు సమాచారం అంధించారు. సంఘటనా స్థలం వద్ద మోటారు బైక్, మద్యం బాటిళ్ళు పడి వుండడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు విచారిస్తున్నట్లుగా తెలిపారు.

## నేటి విద్యార్థులే రేపటి దేశపౌరులు

-క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించారు

-విద్యతోనే ప్రపంచాన్ని భారత గొప్పతనాన్ని చాటుచెప్పాలి

అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రారంబించిన ఎమ్మెల్యే శిల్పా



**నంద్యాల , డిసెంబరు 30, ప్రభాతవార్త:** విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను క్రమశిక్షణతో విని నేర్చుకొని చక్కటి రేపటి దేశపౌరులుగా తయారు కావాలని శ్రీశైల నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నూతన ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రారంభ కార్యక్రమానికి అయన హజరైయ్యారు. ఈ సందర్భంగా విదా ్యర్థులు డ్రమ్స్‌డిల్‌తో ఎమ్మెల్యే శిల్పాకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అయన అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రారంభించారు. అయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే ప్రపంచ అన్ని విషయాలపై శ్రద్ద ఉంచి దానికి అనుగుణంగా మన విద్యా విధానాలను మార్చుకొని లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలను తిలకించి ప్రదర్శనలో ఉంచిన పరికరాల గురించి వాటి ప్రయోజనాలను విద్యార్థులు అయనకు వివరించారు. ఎమ్మెల్యే శిల్పాకు పాఠశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎంఎఫ్ ఇమ్మానీయేల్, ఎంఈఓ బ్రహ్మంనాయక్ శాలువ కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.

## హద్దుమీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు



**ఓర్వకల్, డిశంబర్30, ప్రభాతవార్త ;** డిశంబర్ 31వ తేదీ రాత్రి జిల్లా అంతటా పోలీసు పెట్రోలింగ్ ఉంటుందని, యువకులు రోడ్లపైకి వచ్చి హద్దు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ఎలాంటి ఘటనలకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నిబంధనల మేరకు డిశంబర్ 31న రాత్రి మద్యంషాపులు, బార్‌లు, హోటళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థలు, నిర్ణీత సమయాల్లో కచ్చితంగా మూసివేయాలన్నారు. రహదారులపై కేకు కటింగ్‌లు చేయడం నిషేధమన్నారు. మద్యంకు అనుమతి లేని ప్రదేశాల్లో మత్తు పానీయాలు సేవించినా, అందుకు ఏర్పాట్లు సమకూర్చినా చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడమే గాకుండా వాటికి సంబంధించిన సైలెన్సర్‌లు తొలగించి అధిక శబ్దాలతో ఇతరులను ఇబ్బంది పెడితే అలాంటివారిపై చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. వీటితో పాటు బైక్ రేస్‌లు, త్రిబుల్ రైడింగ్, మైనర్‌లు రైడింగ్‌పై కూడా ప్రత్యేక దృష్టి సారించి ఆ వాహనాలను సీజ్ చేసి కఠినమైన సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేస్తామన్నారు. పోలీసు బృందాలు, బ్లూ కోల్ట్, రక్షక్, స్పెషల్ పార్టీ పోలీసులు రాత్రి గస్తీపై గట్టి నిఘా ఉంచుతారన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా హద్దు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అందరూ పోలీసుశాఖతో సహకరించాలన్నారు.

## ఏపీ జ్యూడిషియల్ అకాడమి ఎక్కడ?

-వైసీపీ నాయకులు నోరు మెదపరేం? - టిడిపి బిసిసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి



**నంద్యాల, డిసెంబరు 30, ప్రభాతవార్త:** ఎపీ జ్యూడిషియల్ అకాడమి ఎక్కడ పెట్టాలన్న ప్రభుత్వ ఇష్టం కాదని హైకోర్టు సూచనలతో, సుప్రీంకోర్టు నిబంధనలతో ఏర్పాటు కావాలని పాత జిఓలు రద్దుచేసి కొత్తగా మంగళగిరిలోనే అకాడమికి ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని దీనిపై వైసీపీ నాయకులు నోరు మెదపరేం అంటూ టిడిపి బిసిసెల్ అధికార ప్రతినిధి బిసి గోవిందనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం విలేఖరుల సమావేశాన్ని నిర్వహించారు. న్యాయరాజధాని కర్నూలులో కాదని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి స్పష్టమైన సంకేతాలు ఇచ్చిందని గతంలో కర్నూలులో ఏర్పాటు చేసి జ్యూడిషియల్ అకాడమి రద్దుచేస్తు తీరా రాజధాని ఏర్పాటు చేయాల్సిన సమయంలో విజయవాడలోని మంగళగిరిలో అకాడమి పెట్టెందుకు సన్నాహాలు చేస్తుందని తెలిపారు. హైకోర్టు నేతృత్వంలో ఇప్పటికే అకాడమి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కర్నూలు న్యాయరాజధాని కోసం గర్జనల పేరుతో హడావిడి చేసి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కర్నూలు పర్యటనకు వచ్చినప్పుడు వ్యతిరేకించిన మేధావులు, ప్రస్తుతం నోరు మెదపడం లేదని ఆయన విమర్శించారు. ఈవ్యవహారంపై ప్రభుత్వ వర్గాల్లో సంచలనం రేపుతుందని రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని దీన్ని తీవ్రంగా ఖండిస్టున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కర్నూలులో న్యాయరాజధాని ఏర్పాజటుచేస్తామని బహిరంగ ప్రకటన చేయడం విశేషమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హత పొందిన లబ్దిదారులకు విరివిగా రుణాలు అందించాలి

- రూ.10266.98 కోట్లు జిల్లా ఆర్థిక క్రిడెట్ ప్లాన్

-బ్యాకర్ల సమావేశంలో జిల్లా కలెక్టరు



బా ్యంకు అధికారులతో కలెక్టరు రుణపత్రాల జారీ

**నంద్యాల, డిసెంబరు 30, ప్రభాతవార్త:** రైతులకు వ్యవసాయ పంట రుణాలు, స్వయం సహాయ సంఘాలకు బ్యాంకు లింకేజి రుణాలు తదితరులకు జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్లు భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ అధికారులకు అదేశించారు. శు క్రవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాబార్డు డిడిఎం పార్థువ, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ సత ్యనారాయణ, ఆర్‌బిఐ లీడ్ డిస్ట్రిక్ అఫీసర్ రహిమాన్, కెడిసిసి బా ్యంకు జిల్లా మేనేజర్ శివలీలా, డిఆర్‌డిఎ పిడి శ్రీదర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికార మోహన్‌రావు, పరిశ్రమల జిల్లా మేనేజర్ శ్రీనివాసయాదవ్‌తో పాటు అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత ్సరానికి నాబార్డు పొటెన్షియల్ లింకుడ్ క్రిడెట్ ప్లాన్ అంచనా మొత్తం రూ.10266.98 కోట్లు వార్షిక రుణప్రణాళికను కలెక్టరు విడుదల చేశారు. వ్యవసాయ రంగానికి రూ.8432.29 కోట్లు, పంట రుణాలు 6435.41 కోట్లు, నీటివనరులు రూ.108.48 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణ రూ.245.36 కోట్లు, ప్లాంటేషన్ హార్టికల్చర్, సెరికల్చర్ రూ.101.79 కోట్లుతో పాటు ప్రాధాన్యత రంగాలకు రూ.432.40 కోట్లు, విద్యారుణాలకు రూ.100.96 కోట్లు, గృహ రుణాలకు రూ.295.71 కోట్లు, శక్తివనరులకు రూ.7.29 కోట్లు, సామాజిక మౌలిక సదుపాయాల కల్పనకు రూ.28.4 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు కలెక్టరు తెలిపారు. అయా రంగాలకు నిర్ధేశించిన మేరకు రుణాలు మంజూరుకు సంబంధిత అధికారులు, బ్యాంకర్లు కృషిచేయాలన్నారు. జిల్లాలో 70 శాతం మంది వ్యవసాయంపై అధారపడి జీవిస్తున్నారని తెలుగుగంగ, ఎస్ఆర్‌బిసి, కెసి కెనాల్, తదితర సాగునీటి కాల్వల కింద రైతులు పంటలు సాగుచేసుకుంటున్నారని వీరందరికిరుణాలు అందించి సహకరించాలని బ్యాంకర్లకు కలెక్టరు సూచించారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొనా ్నరు.

## పదవతరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల

-ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పరీక్షలు

-జిల్లా విద్యాశాఖాధికారి

**నంద్యాల విద్య, డిసెంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా పదవతరగతి పబ్లిక్ పరీక్షలు వచ్చే ఏడాది ఏప్రిల్ 3వ తేది నుంచి ప్రారంభం అవుతాయని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టరు దేవానంద్‌రెడ్డి ప్రతే ్యక ఉత్తర్వులు జారీచేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం అనురాధ తెలిపారు.



పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. తెలుగు సబ్జెక్టు 100 మార్కులు, కాంపోజిట్ తెలుగుకు 70 మార్కులు, ప్రభుత్వం సిబిఎస్ఇ తరహాలో రోజువిడిచి రోజు జరిగేందుకు ఏర్పాట్లు చేశారు. గత ఏడాదికి ఈఏడాదికి పరీక్షల్లో స్వల ్ప మార్పులు చేశారు. సెకండ్ ల్యాంగేజ్, హిందీ, ఇంగ్లీషు, లెక్కలు, సైన్స్, సోషల్ సబ్జెక్టులకు 100 మార్కుల ప్రశ్నపత్రాలు తయారుచేస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 3న తెలుగు పరీక్ష, 6న హిందీ పరీక్ష, 8న ఇంగ్లీషు పరీక్ష, 10 లెక్కలు, 13న సైన్స్, 15న సాంఘీక శాస ్త్రం, 17, 18న ఒకేషనల్‌కు సంబంధించిన పరీక్షలు ఉంటాయి. పరీక్షలు పకడ ్బందిగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొదించినట్లు తెలిపారు. పబ్లిక్ సెలవులు, ఆదివారాల్లో పరీక్షలను మినహాయించారు. పరీక్షలు తప్పుడు ప్రశ్నపత్రాలను ఇచ్చినా, ఒకపరీక్షకు బదులు మరోక ప్రశ్నపత్రం ఇచ్చినా, ప్రభుత ్వం ఇచ్చిన కోడ్ ప్రశ్నపత్రం మాత్రమే ఆ రోజు పరీక్షకు ఇవ్వాలని పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ జరిగినా, చూచిరాతలు జరిపినట్లు సమాచారం తెలిపినా ప్రభుత్వ అదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటర్ పరీక్షలు మార్చి 15న ప్రారంభమై ఏప్రిల్3తో ముగుస్తాయి. పదవతరగతి పరీక్షలు ఏప్రిల్ 4 నుంచి ప్రారంభం అవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, నామినల్‌రోల్స్‌ను అప్పగిస్తున్నారు.

## కందుకూరు మృతులకు టి.డి.పి. ఘన నివాళీలు

**జూపాడుబంగ్లా, డిసెంబర్ 30,ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కందుకూరులో పర్యటించిన సమయంలో ప్రమాదవశాత్తు చనిపోయిన ఎనిమిది టి.డి.పి. కార్యకర్తలకు మండల టిడిపి నాయకులు ఘనంగా నివాళీలు అర్పించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో మండల టి.డి.పి.కన్వీనర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి జూపాడుబంగ్లా క్లస్టర్ గిరీశ్వరెడ్డి మాట్లాడుతు జనవరి 27 నుండి టి.డి.పి.జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు చేపట్టిన యువగళం పాదయాత్రను అందరు జయప్రదం చేయాలని, లెకేష్ పర్యటన ప్రకటించగానే వైకాపా నాయకులలో వణుకు మొదలైందని దీంతో అడ్డుకుంటామని ప్రజలను రెచ్చగొట్టేల మాట్లాడడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో నిరుపేదల వృద్ధుల, వికలాంగుల పించన్లను వైకాపా ప్రభుత్వం తొలగించిందని, కొత్త పించన్లు ఇస్తామంటునే ఉన్నవాటిని తొలగిస్తున్నారని, దీనికి ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలో ఉన్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా నాయకురాలు కె.రాణమ్మ, తెలుగు యువత కార్యదర్శి రవికుమార్ యాదవ్, నాయకులు నారాయణరెడ్డి, చల్లా శివరాంరెడ్డి, కృష్ణయాదవ్, మైనార్టీ నాయకులు ఉస్మాన్‌బాష, సంపత్ తదితరులు పల్గొన్నారు.

